8-10Pg1exHMNWJQE.qxd OK:8-10Pg1exHMNWJQE.qxd 1/1/02 6:24 AM Page 1

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

8-10-2026
గురువారం
సంపుటి: 32
సంచిక: 249
పేజీలు: 16
వెల: 6.50



బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

# ‘విద్య’లో సంస్కరణలు

2లో

- విదేశీ వర్సిటీలకు రెడ్‌కార్పెట్.. ఉన్నత విద్యా పాలసీకి ఓకే
- కేబినెట్ భేటీలో 12 కీలక అంశాలపై చర్చ, ఆమోదం
- ఉద్యాన రంగంలో కీలక మార్పులకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్
- హార్టికల్చర్ ఇన్ఫరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు రైట్
- రూ.20.62 కోట్లతో ఎపిహెచ్‌ఐఎంఎస్ ప్రాజెక్టుకు అనుమతి
- అర్హత కల్గిన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ.. డైట్ చార్జీల పెంపు
- కడప జిల్లా పాతూరులో ఆలయ అభివృద్ధికి 7.66 ఎకరాలు
- ప్రకాశం జిల్లా కొండపిలో బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ నిర్మాణానికి 7 ఎకరాలు

## మోడీ - 25యేళ్ల ప్రజాప్రస్థానం
### ప్రధానికి అభినందనలు

2లో



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన సంకల్ప సభలో ప్రజలకు తలవంచి అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# వుయ్ విల్ డు ఇట్

## 25 యేళ్ల ‘పాలనా రజతోత్సవం’ వేళ వికసిత్ భారత్ సంకల్ప సభలో ప్రధాని మోడీ కొత్త నినాదం

## 2047కు ఆత్మనిర్భర్ భారత్‌ను సాధిస్తామని ప్రతిజ్ఞ

**న్యూఢిల్లీ,అక్టోబరు 7:** ప్రభుత్వ అధినేతగా పాతికేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న వేళ ప్రధాని మోడీ దేశప్రజలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఓ కొత్త నినాదాన్ని ప్రజల ముందుకు తెచ్చారు. 2047 నాటికి భారత్‌ను సంపూర్ణంగా వికసిత భారత్‌గా, ఆత్మనిర్భర భారత్‌గా మార్చడమే మన ప్రధాన లక్ష్యమని, దీనిని మనం సాధించి తీరుతామని ప్రధాని మోడీ ఎంతో నమ్మకంతో పునరుద్ఘాటించారు. మనం చేసి తీరుతాం. వుయ్‌విల్ డూ ఇట్ అని ఆయన పిలుపునివ్వగా, సభలో పాల్గొన్న ప్రజలంతా అంతే ఉత్సాహంతో ఆ నినాదాన్ని అందుకున్నారు. వికసిత భారత్ సంకల్ప సభలో మాట్లాడిన ప్రధాని మోడీ, తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 2001 అక్టోబర్ 7న తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఒక ప్రభుత్వ అధినేతగా వరుసగా 25 >>2



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి పయ్యావుల కేశవ్

# హస్తినలో చంద్రబాబు

- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ
- రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ ప్రాజెక్టుపై చర్చ
- ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో వాటాలపైనా సమాలోచన
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నిధులు విడుదల అంశాలపైనా
- నేడు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో సమావేశం
- విశాఖ మెట్రో, పోలవరం, పుష్కరాలపైనా..
- మధ్యాహ్నం సిఐఐ సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం
- అనంతరం అమరావతికి రాక

**అమరావతి, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే విషయంలో జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై కేంద్రమంత్రికి వివరించారు. జిహెచ్‌హెచ్ ప్రారంభోత్సవానికి వచ్చి ఆ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న కేంద్రమంత్రికి సిఎం ధన్యవాదాలు తెలిపారు. ఎయిడెడ్ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్ర వాటాలకు సంబంధించిన అంశంపైనా వారు చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ‘విజయవాడ ఉత్సవ్’కు రావాలంటూ నిర్మలను చంద్రబాబు ఆహ్వానించారు.

రెండురోజుల పర్యటననిమిత్తం బుధవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబుకు టిడిపి ఎంపీలు, నేతలు >>2

# ఢిల్లీలో హోరాహోరీ

- రెండో రోజున కొనసాగిన ‘ఇండీ’ భారీ ఆందోళనలు
- నేతలు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లకుండా అడ్డుకొన్న పోలీసులు
- ఉద్రిక్తత పెరగడంతో లాఠీఛార్జీ
- ఖమ్మం ఎంపి రఘురామిరెడ్డి, రేణుకా చౌదరి సహా పలువురికి గాయాలు
- ఎంపీలతో కలిసి రోడ్డుపైనే పడుకున్న ప్రియాంక గాంధీ
- రాహుల్ సహా పలువురు నేతలను అరెస్టు చేసిన పోలీసులు
- జ్ఞానేశ్‌తోపాటు ప్రధాని, అమిత్‌షా కూడా రాజీనామా చేయాలని నేతల డిమాండ్



బుధవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద రాహుల్, ప్రియాంక గాంధీలను అరెస్టు చేస్తున్న పోలీసులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. వరుసగా రెండోరోజు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి కీలక నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసనలో పాల్గొన్న ఇతర నాయకులు, కార్యకర్తలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా పలువురు ఎంపిలకు కూడా లాఠీఛార్జి చేయడంతో గాయాలయ్యాయి. మహిళా ఎంపిలని కూడా చూడకుండా పోలీసులు అమానుషంగా వ్యవహరించారని నేతలు ఆరోపించారు. ఒకదశలో ప్రియాంక గాంధీ తోటి మహిళా నేతలు,ఎంపిలతో కలిసి రోడ్డుపైనే పడుకుని తన నిరసన ప్రకటించారు. సోదరికి తోడుగా రాహుల్ గాంధీసైతం అక్కడే నిలుచుండిపోయారు. అయితే ఉద్రిక్తతలు మరింతపెరగడంతో పోలీసులు లాఠీఛార్జిచేసి అక్కడినుంచి పంపించే యత్నంచేసారు. మరికొందరిని బలవంతంగా బస్సుల్లోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో నిరసనకారులు ఒక బస్సు టైర్‌ను పంక్చర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం ఎంపి రఘురామిరెడ్డి, రేణుకాచౌదరి మరికొందరు విపక్ష ఎంపిలకు లాఠీఛార్జి కారణంగా గాయాలయ్యాయి. నిరసనను నియంత్రించేందుకు రాహుల్ గాంధీని మరో బస్సులోకి మార్చి బారా ఖంబా రోడ్‌లోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని గంటల తర్వాత ఆయనను విడుదల చేశారు. ముందురోజు కూడా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో వారు ఆకాశవాణి భవన్ వద్ద అనూహ్యంగా బైఠాయించి నిరసన చేపట్టారు. బుధవారం మాత్రం నిరసనకు అధికారికంగా కేటాయించిన జంతర్ మంతర్‌వద్ద ఆందోళన చేపట్టేందుకు ఇండియా కూటమి నేతలు ప్రయత్నించారు. అయితే ముందస్తు అనుమతి తీసుకోలేదని పేర్కొంటూ ఢిల్లీపోలీసులు వారిని అడ్డుకు >>2



బుధవారం ఉండవల్లిలో నిర్వహించిన సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నారా లోకేష్, అనిత, సత్యకుమార్ యాదవ్, సంధ్యారాణి

# డ్రగ్స్.. వద్దు బ్రో!

- మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు
- త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- డ్రగ్స్‌పై ప్రజల్లో అవగాహనకు మంత్రుల క్షేత్రస్థాయి టూర్లు
- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం సమష్టిగా ముందుకు సాగుదాం
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి లోకేష్ పిలుపు
- మంత్రులు అనిత, సత్యకుమార్, రవీంద్ర, సంధ్యారాణి హాజరు

**అమరావతి, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నివారణపై హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన మంత్రుల బృందం ఉండవల్లిలో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ దుష్ఫలితాలపై ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులను చైతన్యవంతం చేసేందుకు ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ వంటి కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాలని ఆదేశించారు. ‘డ్రగ్స్ వద్దు బ్రో’ వంటి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి యువతను చైతన్యం చేయాలని అన్నారు. డ్రగ్స్, గంజాయి చాక్లెట్ల వంటి వాటి రవాణాను నిరోధించేందుకు రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యాన చేపట్టే క్లస్టర్ సమావేశాల్లో ఈగల్ యంత్రాంగాన్ని భాగస్వాములనుచేసి, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలకు రూపకల్పన చేయాల్సిందిగా మంత్రి ఆదేశించారు.

యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాలు సమావేశాల నిర్వహించి డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులను చైతన్యవంతం చేసేలా రాష్ట్ర వ్యాప్తంగా ఔత్సాహిక ఉపాధ్యాయులకు బాధ్యతలు ఇవ్వనున్నట్లు మంత్రి లోకేష్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ‘నషా ముక్త్ భారత్’ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో డ్రగ్స్ నివారణకు ఈగల్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సింథటిక్ డ్రగ్స్ నివారణపై పంజాబ్ పోలీసులు చేపడుతున్న విధానాలను అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ ఈగల్ విభాగం అధికారులకు విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్‌ను విశాఖపట్నంలో నిర్వహించాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై మంత్రులు పాల్గొనే ప్రతి సమావేశంలో ప్రస్తావించి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు. డ్రగ్స్‌పై పెద్దఎత్తున ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రుల బృందం నిర్ణయించింది.

హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఒడిశా నుంచి రాష్ట్రంలోకి గంజాయి రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. ఒడిశా సరిహద్దుల్లోని చెక్ పోస్టుల్లో నిఘాను పటిష్టం చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డ్రోన్ నిఘాను విస్తృతం చేయాలని >>2

# అణురహస్యాలు అరచేతిలోకి

- ఫ్రెంచి సైంటిస్ట్ హెన్రీ కగాన్, జపాన్ శాస్త్రవేత్త కెన్సోసోయ్‌కి కెమిస్ట్రీలో నోబెల్



హెన్రీ కాగన్



కెన్సో సోయ్

**స్టాక్‌హోమ్, అక్టోబరు 7:** కొన్ని అణువుల దర్పణ ప్రతిబింబ రూపాలలో కేవలం ఒక రకం మాత్రమే ప్రకృతిలో ఎందుకు కనిపిస్తుందనే రహస్యాన్ని ఛేదించినందుకు ఫ్రాన్స్‌కు చెందిన హెన్రీ కాగన్, జపాన్‌కుచెందిన కెన్సో సోయ్ బుధవారం రసాయన శాస్త్ర నోబెల్ బహుమతిని గెలుచుకున్నారు. ఔషధాల అభివృద్ధికి ఈ ఆవిష్కరణ చాలా కీలకమైనది. “అసిమెట్రిక్ ఆర్గానిక్ సింథసిస్‌లో నాన్ లీనియర్ ఎఫెక్ట్స్, ఆటోకెటాల సిస్ ఆవిష్కరణకుగాను ఈద్వయాన్ని సత్కరించినట్లు జ్యూరీ పేర్కొంది. చేతుల వలె, అన్ని అమైనో ఆమ్లాలు రెండు దర్పణప్రతిబింబ రకాలుగా ఉంటాయి, కానీ వాటిలో ఒకటిమాత్రమే శరీర కణాలలోని ప్రోటీన్లలో కనిపిస్తుంది. రెండవది ప్రకృతిలో చాలా అరుదుగాకనిపిస్తుంది, ఈదృగ్విషయాన్ని “హోమో కిరాలిటీ” అని పిలుస్తారని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వివరించింది. ఆ ప్రక్రియ ఎలా జరుగుతుందో రసాయన శాస్త్రవేత్తలు చాలా కాలంగా ఆలోచిస్తున్నారు, ఈ ఇద్దరు నోబెల్ గ్రహీతల ఆవిష్కరణలు “హోమోచిరాలిటీకి దారితీసే రసాయనచర్యలను నడిపించడానికి రసాయన శాస్త్రవేత్తలకు వీలుకల్పించాయి”అని జ్యూరీ పేర్కొంది. “శతాబ్దానికి పైగా ఉన్న ఒక రసాయన రహస్యానికి హెన్రీ కాగన్, కెన్సో సోయ్ ఒక పరిష్కారాన్ని అందించారు. హోమోచిరాలిటీ దానంతట అదే ఎలా ఆవిర్భవిస్తుంది. వారు అభివృద్ధి చేసిన రసాయన చర్యలు అద్భుతమైనవి” అని రసాయన శాస్త్ర నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే అన్నారు. “ఔషధాల తయారీ కోసం చర్యలను రూపొందించే రసాయన శాస్త్రవేత్తలకు వారి ఆవిష్కరణలు నిర్ణయాత్మకమైనవి” అని జ్యూరీ పేర్కొంది.





# ఏపిలో పెట్టుబడులకు కొత్త ఊపు

- రూ.22.6 లక్షల కోట్లతో 714 ప్రాజెక్టులు
- 9.3 లక్షల ఉద్యోగాలు
- విశాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం: మంత్రి టి.జి.భరత్

**విశాఖపట్నం, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెట్టుబడులకు కొత్త ఊపు వచ్చిందని, ఆర్థిక అభివృద్ధి కేవలం ప్రజెంటేషన్లలో కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే ప్రభుత్వలక్ష్యమని వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. గంభీరం ఐఐఎంలో బుధవారం జరిగిన 31వ ప్రాంతీయ పెట్టుబడుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.22.6 లక్షల కోట్ల విలువైన, 9.3 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించే 714 ప్రాజెక్టుల ప్రణాళిక సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.5లక్షలకోట్ల విలువైన 257 ప్రాజె >>2

8-10pg2exHMNWJQE.qxd:8-10pg2exHMNWJQE.qxd 1/1/02 6:25 AM Page 1





బుధవారం ఎల్‌కె అద్వానీని కలుసుకున్న ప్రధాని మోడీ

# అద్వానీ ఆశీస్సులు తీసుకున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,అక్టోబరు 7:** బిజెపి సీనియర్ నాయకుడు ఎల్‌కే.అద్వానీని ప్రధాని మోడీ కలిశారు. ఆయన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. అనంతరం అద్వానీ దగ్గర ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రభుత్వాధినేతగా మోడీ 25 యేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భేటీ జరిగినట్లుగా తెలుస్తోంది. అద్వానీని మోడీ పరామర్శించిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోడీ ముఖ్యమంత్రిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 25 యేళ్లు పూర్తైంది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ 2001 అక్టోబరు 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు తాను ఈ స్థాయికి చేరుకుంటానని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ విజయం ఆత్మ స్తుతికి సందర్భం కాదని.. కృతజ్ఞతలు తెలియజేయాల్సిన తరుణమని ప్రధాని మోడీ అన్నారు.

# వుయ్ విల్ డు ఇట్

>> యేళ్ల సేవ చేసే అవకాశం వస్తుందని తాను ఏనాడూ ఊహించలేదని అన్నారు. ఈ మైలురాయిని చేరుకోవడానికి ప్రజల నిరంతర ఆశీస్సులే కారణమని, ఆ క్రెడిట్ అంతా ప్రజలకే దక్కుతుందని వినమ్రంగా చెప్పారు. తన ఈ పాతికేళ్ల ప్రయాణంలో ఎదురైన ప్రతీ అనుభవం నుంచి ఎంతో నేర్చుకున్నానని మోడీ తెలిపారు. జీవితంలో జరిగిన ఏ సంఘటనా వృథా పోలేదని, విజయం వచ్చినప్పుడు అది తనను వినమ్రంగా ఉండటం నేర్పితే, వైఫల్యాలు లేదా పతనాలు మళ్లీ ఎలా గెలిచి నిలబడాలో నేర్పాయని పేర్కొన్నారు. అలాగే శుభాకాంక్షలు తెలిపిన శ్రేయోభిలాషులు తనలో ఉత్సాహాన్ని నింపితే, విమర్శకులు తనను తాను సమీక్షించుకునేలా చేశారన్నారు. ప్రతీ సంక్షోభం తన ఓర్పుకు పరీక్షగా నిలిచిందని, లభించిన ప్రతీ విజయం బాధ్యతను పెంచుతూ, అంతకంటే పెద్ద లక్ష్యాల వైపు అడుగులు వేసే ధైర్యాన్ని ఇచ్చిందని వెల్లడించారు. గడిచిన 25 ఏళ్లలో ఎన్నో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు వచ్చాయని, అన్నింట్లోనూ ప్రజలు తనపై నమ్మకంతో నిరంతరం సేవ చేసే అవకాశాన్ని ఇచ్చారని ప్రధాని మోడీ గుర్తుచేసుకున్నారు. బిజెపి, ఎన్డీయే కూటమి నాయకులకు, సహచర మంత్రులకు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే రాజకీయ భాగస్వాములందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యానికి, దేశ రాజ్యాంగానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సేవా జ్యోతి యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ, ప్రజల అపారమైన నమ్మకం వల్లే ఈ సుదీర్ఘ ప్రయాణం సాధ్యమైందని చెప్పారు. అంతకుముందు రోజు ఉదయమే తాను ఢిల్లీలోని శ్రీ వినాయక ఆలయానికి వెళ్లినట్లు ప్రధాని తెలిపారు. అక్కడ 140 కోట్లకు పైగా ఉన్న భారతీయ ప్రజలందరి సంక్షేమం కోసం ప్రార్థించానని, దేవుడిని ఒక్కటే కోరుకున్నానని చెప్పారు. మరింత శక్తితో, రెట్టింపు ఉత్సాహంతో దేశం కోసం పనిచేసే సామర్థ్యాన్ని, రేయింబవళ్లు ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నట్లు తెలిపారు. ఈ 25 యేళ్ల ప్రయాణం తనకు ఎంతో సంతృప్తిని, కృతజ్ఞతా భావాన్ని ఇచ్చిందని, అయితే తన దృష్టి ఎప్పుడూ భవిష్యత్తుపైనే ఉందని స్పష్టం చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, స్వయం సమృద్ధి కలిగిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఆ లక్ష్య సాధన కోసం వియ్‌విల్‌డూ ఇట్ అనే దృఢ సంకల్పంతో ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు.

# మోడీ - 25యేళ్ల ప్రజాప్రస్థానం

## ప్రధానికి అభినందనలు, ఎపి కేబినెట్‌లో ప్రత్యేక తీర్మానం

### ప్రశంసలు తెలిపిన రాష్ట్ర మంత్రిమండలి

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పాతికేళ్ల ప్రజా ప్రస్థానంపై ప్రధాని మోడీకి అభినందనలు తెలుపుతూ సిఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన ఎపి కేబినెట్ తీర్మానం చేసింది. ప్రత్యేక తీర్మానం ద్వారా ప్రధాని మోడీకి రాష్ట్రమంత్రి మండలి అభినందనలు, ప్రశంసలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందించిన ప్రధాని మోడీని కొనియాడింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని ప్రశంసించింది. దూర దృష్టి... స్పష్టమైన లక్ష్యం.. సమర్థవంతమైన పాలనతో భారత్‌ను కీలకస్థానంలో నిలిపారని కేబినెట్ వ్యాఖ్యానించింది. సృజనాత్మకత, ఆవిష్కరణ, వేగవంతమైన పాలనకు మోడీ ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడింది. మౌలిక వసతులు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లారని పేర్కొంది. సాంకేతిక ఆధారిత పాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని, సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా మార్చి భారత్‌ను అభివృద్ధివైపు తీసుకెళ్తున్నారని ప్రసంశలు కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా దేశానికి స్థిరమైన నాయకత్వ అందిస్తున్నారని రాష్ట్ర మంత్రివర్గం పేర్కొన్నది. సాహసోపేత నిర్ణయాలతో పాటు దీర్ఘకాలిక జాతీయ ప్రాధాన్యాలపై దృష్టిపెట్టి దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నది. దేశ ప్రయోజనాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి ప్రపంచ వేదికలపై భారత్ ప్రతిష్ఠను పెంచారని కొనియాడింది. వ్యూహాత్మకంగా ప్రపంచ దేశాలతో భారత్‌కు బలమైన భాగస్వామ్యాలను ఏర్పాటు చేయటంలో ప్రధాని కృషి కీలకం అని పేర్కొంది. ప్రపంచ వ్యవహారాల్లో భారత్ స్వరానికి మరింత గౌరవం, విశ్వసనీయత పెరిగేందుకు ప్రధాని తోడ్పడ్డారని అంది. ఆధునిక సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన దేశ నిర్మాణానికి ప్రధాని మోడీ చేసిన కృషి ప్రశంసనీయమైనది. మోడీ విజన్, రాజనీతిజ్ఞతతో భారత దేశ ప్రగతికి బలమైన పునాదులు పడ్డాయని అభిప్రాయపడింది .21వ శతాబ్దం ప్రధాని మోడీదేనని, దేశసేవలో ఆయనకు మరిన్ని విజయాలు దక్కాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది. మోడీ పరిపాలనను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు ప్రశంసించారు. ఆయనను అభినందిస్తూ చేసిన రెండు పేజీల తీర్మానాన్ని చదివి మంత్రి నారా లోకేశ్ వినిపించారు. సిఎంగా, ప్రధానిగా 25 యేళ్ల పనిచేసి ప్రజలను మెప్పించడం సామాన్యమైన విషయం కాదని సిఎం చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. మనం కూడా 25 యేళ్ల వరుసగా పాలనలో ఉండలేకపోయామని ప్రస్తావించారు. కొంతమంది సిఎంగా 25 యేళ్లు పనిచేసిన సంస్కరణలు తీసుకురాలేకపోయారని చెప్పుకొచ్చారు. కానీ జనాన్ని మెప్పించి పరిపాలన చేయడమే గాకుండా సంస్కరణలు కూడా చేసి జనాన్ని మోడి ఒప్పించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రధాని మోడీ సంపూర్ణ ఆరోగ్యంతో మరెన్నో యేళ్ల దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు.

# 'విద్యలో సంస్కరణలు

**అమరావతి, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యానరంగం కీలక మార్పులకు ఎపి మంత్రి మండలి సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యారంగంలోను సంస్కరణలను చేపట్టడానికి నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు సాగిన కేబినెట్ భేటీలో 12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లకు మార్గం సుగమం చేస్తూ 2026 ఉన్నత విద్యా పాలసీకి, విద్యా చట్ట సవరణకు రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎపి విద్యా చట్టం-1982 సవరణలకు ఆమోదం.ఆశా కార్యకర్తల గ్రాట్యుటీ పెంచేందుకు అమాత్యులు అంగీకారం తెలిపారు. రేపల్లె ఆసుపత్రి అప్‌గ్రేడ్, గిరిజన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ వంటి ప్రతిపాదనలకూ కేబినెట్ ఆమోదం తెలిపింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ క్రమంలో కీలక నిర్ణయాలకు ఆమోదముద్రవేసింది. 12అంశాలపై ఆమోదం, సవరణలు, నిర్ణయాలతో పాటు పలు ఉత్తర్వులకు రాటిఫికేషన్ ఇచ్చింది. ఉద్యాన రంగాన్ని డిజిటల్ బాట పట్టించే ఎపిహెచ్ ఎంఎస్ వ్యవస్థకు ఆమోదం లభించింది. క్యూసిబిఎస్ విధానంలో ఎంపికైన వాసర్‌ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్‌కు రూ.20.62 కోట్లతో ప్రాజెక్టును అప్పగించనున్నారు. ఇందులో రూ.11.77 కోట్లు అభివృద్ధి వ్యయానికి, రూ.8.85 కోట్లు ఐదేళ్ల నిర్వహణ, సేవలకు కేటాయించారు. ఆశా కార్యకర్తలకు సామాజిక భద్రత కల్పించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. సేవలో ఉండగానే మరణించే అర్హత కలిగిన ఆశా కార్యకర్తలకు సంవత్సరానికి రూ.5వేల చొప్పున గ్రాట్యుటీచెల్లించనున్నారు. ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు అందుతుంది. ఇందుకు అవసరమైన నిధులను ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయించేందుకు అనుమతి ఇచ్చారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ఆమోదం తెలిపారు.

**గిరిజన విద్యార్థులకు రెసిడెన్షియల్ కోచింగ్:**

విద్య, సంక్షేమ రంగాలకు సంబంధించి ఇప్పటికే జారీ చేసిన పలు ఉత్తర్వులకు కేబినెట్ రాటిఫికేషన్ ఇచ్చింది. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, ఆశ్రమ పాఠశాలలు, కెజిబివిలు, మోడల్ స్కూళ్లలో డైట్‌ఛార్జీల పెంపు ఉత్తర్వులను కూడా రాటిఫై చేసింది. గిరిజన విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణను మరింత బలోపేతం చేయనున్నారు. విశాఖపట్నం మరికవలసలోని ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదించింది. ఐఐటి జెఇఇ, నీట్ కోసం గిరిజన విద్యార్థులకు ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నారు. కుప్పం అభివృద్ధికి అవసరమైన భూ కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం నక్కనపల్లెలో 1.69ఎకరాల గ్రేజింగ్ గ్రౌండ్ పోరంబోకు భూమి వర్గీకరణను మార్చి కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రభుత్వ పోరంబోకు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఉత్తర్వులకు రెవెన్యూ శాఖ రాటిఫికేషన్ లభించింది.

**విద్యార్థులకు వసతి విద్యకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్:**

వైఎస్సార్ కడప జిల్లా పాతూరులో ఆలయ అభివృద్ధి కోసం 7.66 ఎకరాల ప్రభుత్వ భూమిని దేవాదాయశాఖకు బదలాయింపుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వైఎస్సార్ కడప జిల్లా నందలూరు మండలం పాతూరులోని శ్రీ కన్నేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం 7.66 ఎకరాల ప్రభుత్వ భూమిని బదలాయించనున్నారు. భూమి విలువ రూ.60.20 లక్షలుగా అంచనా వేశారు. ఉడా ఎన్ఓసి, ఇతర నిబంధనలకు లోబడి ఉచితంగా లేదా మార్కెట్ విలువ చెల్లింపు ప్రాతిపదికన భూమి బదలాయింపును చేపట్టనున్నారు. ప్రకాశం జిల్లాలో గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు వసతి విద్యకు మరో అడుగు పడింది. కొండపి మండలం కెజికె కండ్రికలోని 7 ఎకరాల వాగు పోరంబోకు భూమిని అసెస్డ్ వేస్ట్‌గా వర్గీకరణ మార్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ భూమిని ఎంజెపిఎపిబిసిడబ్ల్యుఆర్ఇఐఎస్ బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ ఏర్పాటుకు వినియోగించనున్నారు.

# ఢిల్లీలో హోరాహోరీ

>> న్నారు. ఢిల్లీలోని ఓ రెస్టారెంట్‌లో వ్యూహాత్మక భేటీ అనంతరం ఎంపీలు జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే మార్గమధ్యలోనే పోలీసులు వారి వాహనాలను నిలిపివేశారు. మొదట రాహుల్ గాంధీ సహా పలువురు నేతలను బస్సులో కూర్చోబెట్టారు. అనంతరం ఇతర నాయకులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, ఇండియాకూటమి నేతలు బస్సుల నుంచి దిగి రోడ్డుపై తిరిగి బైఠాయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రోడ్డుపైనే కూర్చొని, అక్కడి నుంచి వెళ్లాలన్న పోలీసుల విజ్ఞప్తిని తిరస్కరించారు. ప్రియాంక గాంధీ రోడ్డుపై పడుకుని తనను ఎవరు తరలిస్తారో చూద్దామన్నట్లుగా వ్యవహరించారు. ఎంపీలతో ఇలావ్యవహరిస్తారా? ఇది ఎన్నడూ జరగనివిషయం. మేము ఇక్కడినుంచి కదలబోమని ప్రియాంకగాంధీ వ్యాఖ్యానించారు. చివరకు పోలీసులు రాహుల్, ప్రియాంక గాంధీలను బలవంతంగా అక్కడి నుంచి తరలించి బస్సులోకి ఎక్కించారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆహ్వానం మేరకుఇండియా కూటమి నేతలు ఢిల్లీలోని జన్‌పథ్‌లో ఉన్న సాగర్ రత్న రెస్టారెంట్‌లో సమావేశమయ్యారు. ఓటు చోరీ" అంశంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్లడంపై సమావేశంలో చర్చించారు. దేశంలో ప్రజాస్వామ్యం ధ్వంసమవుతోందని ఆరోపించిన ఖర్గే ఓటు చోరీ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఎంపీలు బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే జంతర్ మంతర్‌కు వెళ్లే అన్ని మార్గాల్లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రతిపక్ష ఎంపీలను తీసుకెళ్తున్న బస్సులను మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్‌లో ఎలాంటి నిరసన చేపట్టాలన్నా ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ప్రతిపాదిత కార్యక్రమానికి కనీసం 10 రోజుల ముందు న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌కు అనుమతి కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. భోజనం అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎంపీలు జంతర్ మంతర్‌లో నిరసన చేపడతారని తెలిపారు.ముందురోజు తాను చెప్పినట్లుగానే సుమారు 300 మంది ఎంపీలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలవాలనుకున్నారు. కానీ అక్కడ నిరసన చేపట్టేందుకు అనుమతి లేదని చెప్పారు. అందుకే ఈరోజు కేటాయించిన నిరసన స్థలం జంతర్ మంతర్‌కు వెళ్లి మరోసారి అందరం కలిసి కూర్చుంటాం. దేశానికి ఒక విషయం చెబుతాం. మాదృష్టిలో జ్ఞానేశ్‌కుమార్ దేశానికి చట్టబద్ధమైన ఎన్నికల కమిషనర్ కాదు" అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి దేశ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. మంగళవారం చేపట్టినధర్నాపై తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ వ్యంగ్యంగా స్పందించారు. నాపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100. నాపై మరో 100 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయండని ఆయన అన్నారు. మంగళవారం అనుమతి లేకుండా ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు ఆరు గంటల పాటు నిరసన చేపట్టినందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై బుధవారం కేసులు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, ముందురోజు రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ప్రతిపక్షాల నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో పార్లమెంట్ స్ట్రీట్ ప్రాంతంలో సుమారు ఎనిమిది గంటల పాటు నిరసన కొనసాగింది. తరువాత రాహుల్ గాంధీని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు నేతలను రాత్రి 10 గంటల తర్వాత సుమారు రెండు గంటల నిర్బంధం అనంతరం విడుదల చేశారు. అయితే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహ కొందరు కాంగ్రెస్ ఎంపీలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించారు. ఎన్నికల సంఘం కార్యాలయం కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఎన్నికల కమిషనర్లను కలిసేందుకు అనుమతించాలని వారు డిమాండ్ చేశారు. మధ్యాహ్నం ప్రారంభమైన వారి ధర్నా రాత్రి 8 గంటల తర్వాత ముగిసింది. భారీ సంఖ్యలో పోలీసులు అక్కడికి చేరుకుని రాహుల్ గాంధీతో పాటు ఇతర నేతలను బలవంతంగా బయటకు తీసుకెళ్లి పోలీసు వాహనాలు, బస్సుల్లోకి ఎక్కించారు. ఎన్నికల సంఘం వద్ద భారీ భద్రత ఇండియా కూటమి ఎంపీలు కేంద్ర ఢిల్లీలోని రెస్టారెంట్‌కు చేరుకుంటున్న సమయంలో ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. ప్రతిపక్షాల నిరసన నేపథ్యంలో ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లే ప్రధాన మార్గాలన్నింటినీ మూసివేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష ఎంపీలు ధర్నా చేపట్టిన ఆకాశవాణి భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లపై కాంగ్రెస్ ఎంపీలు స్పందిస్తూ.. తమకు భయం లేదని స్పష్టం చేశారు. గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల గురించి మేము పట్టించుకోము. దేశవ్యాప్తంగా ఇలాంటి వందలాది కేసులు నమోదయ్యాయని కాంగ్రెస్ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి మాట్లాడుతూ మేము ఇక్కడ భోజనం కోసం వచ్చాం. నిరసనలు కొనసాగుతాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేతను నేరస్థుడిలా ఈడ్చుకెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎఫ్ఐఆర్‌లకు మేము భయపడబోమని అన్నారు.

# ఉత్సవాల విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు

**విజయవాడ, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** విజయవాడలో వచ్చేవారం నుండి ఒకేసారి మూడు ఉత్సవాలు జరుగనున్నందున పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా విజయవాడ యంపి కేశినేని చిన్నిలు అధికారులను ఆదేశించారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం వివిధశాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీరుమాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులు, విజయవాడ ఉత్సవ్-2, సరస్ అజీవికమేళా మూడు ఉత్సవాలు ఒకేసారి జరుగుతున్నాయని, వీటికి ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. దశరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు సంతృప్తికరమైన దర్శన అనుభూతి కలిగేలా చూడాల్సి ఉందనానరు. మూడు ఉత్సవాలకు హాజరయే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రించటంతోపాటు, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. సరస్ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి స్వయం సహాయకసంఘాల మహిళలు తామ ఉత్పత్తులతో 650స్టాళ్ళు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. వినూత్న కార్యక్రమాలతో విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈఉత్సవాలకు ప్రముఖులు హాజరుకానున న్నందున పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్‌లకు సూచించారు. ఎక్కడా ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా జగ్రత్తలు తీసుకోవాలని, అధికారులకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఆర్డీఓ వెన్నెల శ్రీను, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

08-10-2026, గురువారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్త కార్తె,
తి.త్రయోదశి రా.10.18,
న. పూర్వఫల్గుణి రా .9.22,
వ.తె 4.35 -ఉ.6.10,
దు.ఉ.9.56-ఉ.10.44, 2)మ.2.41- మ.3.29,
రాహు.మ.1.30- మ.3.00,
శుభ. స.ఉ.8.00-ఉ.9.00.

## వార్తాఫలం

**మేషం :** ప్రతి విషయాన్ని సూక్ష్మదృష్టితో పరిశీలిస్తారు. విజ్ఞానపరమైన ఆలోచనలు చోటు చేసుకుంటాయి.

**వృషభం :** మీ పై ప్రచారంలో ఉన్న అపవాదులను రూపుమాపుకునే ప్రయత్నాలకు గాను శ్రీకారం చుడతారు.

**మిథునం :** జీవిత భాగస్వామితో స్వల్పమైన వాగ్వివాదాలు చోటు చేసుకుంటాయి. తగినంత ధనాన్ని సమకూర్చుకోగలుగుతారు.

**కర్కాటకం :** నూతన వ్యక్తితో పరిచయం మిత్రత్వానికి దారి తీస్తుంది. ఉద్యోగ యత్నాలు నత్తనడక సాగుతాయి.

**సింహం :** మీపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్న వారిని గుర్తించి వారికి దూరంగా ఉంటారు.

**కన్య :** సెల్ఫ్ డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు. ఎదుటి వారికి మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారు.ఋణాలు లభిస్తుంది.

**తుల :** మీ హోదాను పెంచే విధంగా సంతానం అభివృద్ధిపథంలో పయనిస్తారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** వ్రజా సంబంధాలు వృద్ధి చేసుకోవడానికి ప్రాముఖ్యతనిస్తారు. ఇందుకు గాను ధనాన్ని అధిక మొత్తంలో ఖర్చు చేస్తారు.

**ధనుస్సు :** మీ మిత్రవర్గంలోని ఒకరితో అభిప్రాయ భేదాలు చోటు చేసుకుంటాయి. సంఘంలో విశేష ఆదరణ లభిస్తుంది.

**మకరం:** స్థిరాస్తి కొనుగోలు సానుకూల పడుతుంది. సాంప్రదాయాలకు విలువనిచ్చి ఆధునిక పోకడలకు దూరంగా ఉంటారు.

**కుంభం :** ఋణాలకు సంబంధించిన విషయాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఇతరుల మాటను లెక్క పెట్టరు.

**మీనం :** అధికారుల వలన ఇబ్బందులు ఏర్పడే సూచనలున్నాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం న్యూఢిల్లీలో సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీలు

# డ్రగ్స్.. వద్దు బ్రో!

>> సూచించారు. డ్రగ్స్ పై అవగాహనకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ మాట్లాడుతూ ఇటీవల విశాఖ, నర్సరావుపేటలో గంజాయి చాక్లెట్లు పట్టుబడ్డాయని, అయితే అవి బీహార్, యుపి నుంచి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు. దీనిపై ఆయా రాష్ట్రాల్లోని పోలీసు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి అప్రమత్తం చేశామని అన్నారు. మత్తుకోసం షెడ్యూల్ డ్రగ్స్, కాఫ్ సిరప్ వంటివి వాడుతున్న వారిపై నిఘా వేసి ఉంచామని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆ మందులను విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేసినట్లు చెప్పారు. విజయవాడ, రాజమండ్రి నగరాల్లో డ్రగ్స్‌ను ఉపయోగించే బ్లేడ్ బ్యాచ్‌లను గుర్తించి, కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 సుశిక్షిత జాగిలాలను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ వినియోగంపై అనుమానితులను గుర్తించి, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి 192మంది యాక్టివ్ రిపీట్ అఫెండర్స్‌ను గుర్తించి, వారిపై తీవ్రమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా, ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజిత్ పాల్గొన్నారు.

# పెట్టుబడులకు కొత్త ఊపు

>> క్టులు క్షేత్రస్థాయికి చేరుతున్నాయని చెప్పారు. ఈ సదస్సులో రూ.21,498 కోట్ల విలువైన 31 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, వీటి ద్వారా 92 వేలకుపైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. సుమారు రూ.5 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని తెలిపారు.బ్యాంక్ ఆఫ్ బరోడా, ఫోర్బ్స్ నివేదికల ప్రకారం దేశంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 25.3 శాతంగా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు రాష్ట్రం అడుగులు వేస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులు, మంత్రులు, ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు, సహకారం అందిస్తున్నామని తెలిపారు.నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.35 లక్షల కోట్లతో 18 మిలియన్ టన్నుల సామర్థంతో భారీ ఉక్కు ప్రాజెక్టును చేపడుతోందని, దీనివల్ల సుమారు 55 వేల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. గూగుల్, రిలయన్స్ సంస్థలు కృత్రిమ మేధ, డేటా సెంటర్ల రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నాయని వివరించారు.ఉక్కు, కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, హరిత హైడ్రోజన్, రక్షణ, నౌకా నిర్మాణం, ఆహార శుద్ధి, అంతరిక్షం, డ్రోన్ రంగాల్లో విశాఖ అభివృద్ధి చెందుతోందన్నారు. విశాఖను మరో బెంగళూరు, హైదరాబాద్‌గా కాకుండా తనదైన గుర్తింపు, సామర్థ్యాలతో ప్రపంచస్థాయి తీర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్రంలో 175 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్కులు, పారిశ్రామిక కారిడార్లు, రంగాల వారీగా పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతుకు అధిక ఆదాయం, యువతకు స్థానికంగా ఉద్యోగాలు, మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించనున్నామని తెలిపారు. పెట్టుబడిదారులు కేవలం సదస్సు కోసం కాకుండా ఒక ప్రాజెక్టు, ఆలోచనతో రాష్ట్రానికి రావాలని మంత్రి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి, ఎంపీలు అప్పలనాయుడు, శ్రీభరత్, ఆరు జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు, కలెక్టర్లు, సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి పెట్టుబడులే కీలకం**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని రాష్ట్ర మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంతోపాటు రవాణా, లాజిస్టిక్స్ రంగాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష ్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంలో బుధవారం సిఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు రవాణాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. రవాణాలో ఆదా అయ్యే ప్రతి రోజు, లాజిస్టిక్స్‌లో ఆదా అయ్యే ప్రతి రూపాయి పెట్టుబడుల పోటీతత్వాన్ని పెంచుతుందని వివరించారు. పంచాయతీరాజ్, రహదారులు-భవనాలు, పురపాలక శాఖల పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 1.60 లక్షల కిలోమీటర్ల రహదారి నెట్‌వర్క్ ఉందని, ఇందులో 8,360 కిలోమీటర్లు జాతీయ రహదారులని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం రూ.లక్ష కోట్లకు పైగా విలువైన రహదారి ప్రాజెక్టులు నిర్మాణం, డిపిఆర్ దశల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. గత రెండేళ్లలో జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో దాదాపు రూ.24 వేల కోట్లతో 1,530 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టి దేశంలో ఏపీ మూడో స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకారంతో రూ.31 వేల కోట్లతో అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టు మంజూరైందని తెలిపారు. ఓడరేవుల అనుసంధానతను మెరుగుపరిచేందుకు 23 ప్రాజెక్టులను గుర్తించినట్లు వెల్లడించారు. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట ఓడరేవులు 2027 మార్చి నాటికి అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ప్రైవేటు భాగస్వామ్యంతో నాలుగు బహుళ రవాణా విధానాల లాజిస్టిక్స్ పార్కులు, ఆరు సమీకృత లాజిస్టిక్స్ పార్కులు, 22 ట్రక్ టెర్మినళ్లు, 300 కోల్డ్‌చైన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆక్వా రంగానికి కోల్డ్‌చైన్‌లు, ఔషధ పరిశ్రమకు ఉష్ణోగ్రత నియంత్రిత గిడ్డంగులు, రసాయనాలు, లోహాల రంగాలకు బల్క్ హ్యాండ్లింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రవాణా వ్యవస్థలో సమన్వయం కోసం 'ఎపి-లింక్' అపెక్స్ సంస్థను ఏర్పాటు చేస్తున్నామని, రవాణా సమాచారాన్ని అందించేందుకు 'ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్' యాప్, డ్యాష్‌బోర్డులను వినియోగిస్తున్నామని చెప్పారు. విశాఖపట్నం జిల్లాలో ఔషధ, పెట్రోలియం, ఐటీ రంగాలకు, శ్రీకాకుళంలో సముద్ర, వ్యవసాయ రంగాలకు, విజయనగరంలో ఆక్వా, ఇంజినీరింగ్ రంగాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.సంయుక్త భాగస్వామ్యాలు, పిపిపి విధానం లేదా స్వతంత్ర పెట్టుబడుల ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. సిఐఐ ప్రాంతీయ సదస్సుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు టిజి భరత్, బిసి జనార్దన్‌రెడ్డి, సిఐఐ ఎపి చైర్మన్ నరేంద్రకుమార్ శరణం, సిఐఐ ప్రతినిధులు మురళీకృష్ణ గన్నంనేని, సాంబశివరావు పాల్గొన్నారు. ఎంపిలు భరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతి, విష్ణుకుమార్‌రాజు, బండారు సత్యనారాయణ, ఎన్.ఈశ్వరరావు హాజరయ్యారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, ఎపి ఇడిబి సిఇఓ సాన్మోహన్, పరిశ్రమల శాఖ ఎండి బన్సాల్, ఎపిఐఐసి ఎండి దినేష్‌కుమార్, ట్రాన్స్‌కో కమిషనర్ రవి పట్టన్‌శెట్టి, ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్, విజయనగరం జిల్లా కలెక్టర్ రాం సుందర్‌రెడ్డి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ పుండార్కర్, విశాఖ జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి తదితర అధికారులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు సదస్సుకు హాజరయ్యారు.

# హస్తినలో చంద్రబాబు

>> ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జలవనరుల శాఖ మంత్రి సిఆర్ పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, శర్బానంద్ సోనోవాల్‌లతో సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష ్యంగా ఈ సమా వేశాలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు అనుమతులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రత్యేక నిధులు, వచ్చే యేడాది గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్ర సహకారం వంటి అంశాలపై చంద్రబాబు విజ్ఞప్తి చేయనున్నారు. వీటితో పాటు గోదావరి వరద జలాల సద్వినియోగం, నదుల అనుసంధానంపై కూడా చర్చించనున్నారు.నేడు (అక్టోబరు 8) మధ్యాహ్నం ఢిల్లీలో జరిగే సిఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌తోకలిసి చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించు కుని రాత్రికి ఆయన తిరిగి అమరావతికి రానున్నారు. ఇదే సందర్భంగా, ప్రధాని మోడీ 25 యేళ్లుగా నిరంతరాయంగా కార్యనిర్వాహక పదవుల్లో కొనసాగుతున్నందుకు చంద్రబాబు ఆయన నాయకత్వ పటిమను ప్రశంసించారు. స్పష్టమైన దార్శనికత, నిజాయతీ, క్రమశిక్షణే ఆయన విజయానికి కారణమని పేర్కొన్నారు.

# పెద్దపులి మళ్లీ వచ్చేసింది!



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** గత కొన్ని రోజులుగా పోలవరం జిల్లాలో సంచరించిన పెద్దపులి బుధవారం తూర్పుగోదావరి జిల్లాలోకి మళ్లీ ప్రవేశించింది. సీతానగరం, గోపాలపురం, తాళ్లపూడి మండలాల పరిసర ప్రాంతాల్లో పులి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం రాత్రి సీతానగరం మండలం వంగలపూడి- రామచంద్రాపురం మధ్య గోదావరి నదిని దాటిన పెద్దపులి, గోపాలపురం మండలం గోపవరం మీదుగా తాళ్లపూడి మండలం తుపాకులగూడెం, బయ్యారం, రాగోలపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు జిపిఎస్ ట్రాకర్ ద్వారా అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. పులి సంచారం నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు తెల్లవారుజామున పొలాలకు వెళ్లవద్దని హెచ్చరించారు.

# ప్రభుత్వ పనితీరు, పరిపాలనా సమర్థత విషయంలో ప్రజలకు అవగాహన కల్పించండి

- కేబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పనితీరు, పరిపాలనా సమర్థత విషయంలో ప్రజలకు అవగాహన కల్పించే దిశలో మెరుగైన పనితీరును మంత్రులు కనబర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆయా మంత్రిత్వశాఖల పరిధిలో సిబ్బందిని సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసే దిశలో మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు. బుధవారం మంత్రివర్గ భేటీ ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సిఎం చంద్రబాబు చర్చించారు. గతంలో కేటాయించిన జగనన్న కాలనీలపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. జగనన్న కాలనీల్లో ఇల్లు కట్టుకుంటామంటే ప్లాట్లు ఇవ్వాలని సిఎం ఆదేశించారు. ప్లాట్లు దక్కిన వారు తమకు అక్కరలేదని చెబితే వేరే ప్రాంతంలో ఇవ్వాలని, అలాగే ఆ కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేరే వారికి కేటాయించాలని ముఖ్యమంత్రి సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ వెంటనే ఈ అంశాలపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కర్మయోగి కార్యక్రమంలో భాగంగా మంత్రులు అందరూ తమ శాఖల పరిధిలోని సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అన్నారు. స్వయం ఉపాధి గ్రూప్‌ల దగ్గర ప్రస్తుతం రూ.30 వేల కోట్లు కార్పస్ నిధులు ఉన్నాయని పేర్కొని, మిగతా గ్రూప్‌లను కూడా అలా తయారు చేయాలని సూచించారు. ప్రజలతో సన్నిహితంగా ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తే నాయకులుగా ఎక్కువ కాలం జనంలో మనం ఉంటామని సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కుప్పంలో సేద్యానికి ఇజ్రాయిల్ టెక్నాలజీ తీసుకువస్తే తరువాత రాజశేఖరరెడ్డి దానిని నాశనం చేశారని, అదే ఇజ్రాయిల్ టెక్నాలజీ కంపెనీలతో మోడీ గుజరాత్‌లో సేద్యం చేయించి విజయవంతం చేశారని చంద్రబాబు ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. నాయకుడి ఆలోచనపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, రైట్ టైమ్, రైట్ ప్లేస్, రైట్ లీడర్ మోడీ అని సిఎం చంద్రబాబు అన్నారు. మోడీ తాను చేపట్టిన కార్యక్రమాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారని లోకేష్ అన్నారు. ప్రధానిగా ఉండి కూడా మోడీ అందరు చెప్పిన విషయాలను వింటారని సిఎం చెప్పి, మీరు కూడా ప్రజలు చెప్పిన విషయాలను వినాలని మంత్రులకు సూచించారు. కేబినెట్‌లో చెప్పిన విషయాలను కలెక్టర్లకు చెప్పి రివ్యూ చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నలుగురు మంత్రులు మంత్రివర్గ సమావేశానికి రాలేదని మీడియాలో వచ్చిన వార్తలను ప్రస్తావించిన సిఎం, మీడియా చాలా వేగంగా ఉందని అన్ని విషయాలను మీడి యాకు వివరించాలని అన్నారు. మంత్రులు ఏ కారణంతో రాలేదో తనకు తెలుసని, ఈ విషయం మీడియా ముందే చెప్తే బాగుండేదని ముఖ్యమంత్రి అన్నారు. ఏ విషయంలోనైనా. నేను మీరు పారదర్శకం గా ఉండాలన్నారు. ప్రజలకు జవాబుదారీ తనంతో వ్యవహరిస్తేనే వారు మన పట్ల మంచి ఆలోచన చేస్తారన్నారు. సమావేశంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి చమత్కరిస్తూ ఆయా శాఖల మంత్రులను అభినందించారు.



**సిఎంతో మంత్రి నారాయణ భేటీ:** కేబినెట్ భేటీ తర్వాత సీఎంతో మంత్రి నారాయణ సమావేశమైయ్యారు. రాజధానిలో కేటగిరి4, ఎండోమెంట్ భూముల అంశంపై చర్చించారు. న్యాయపర అంశాలు చర్చించాక మరోసారి తన దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రైతులకు ల్యాండ్ పూలింగ్, భూముల సేకరణ, ఆయా నిర్మాణాల ప్రస్తుత స్థితిపై సిఎం చంద్రబాబు వద్ద మంత్రి నారాయణ ప్రస్తావించారు.

# రైతులకు లబ్ధి చేకూరేలా ల్యాండ్ పూలింగ్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ



ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నారాయణ

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులకు పూర్తి స్థాయి ప్రయోజనం కలిగించే విధంగా ల్యాండ్ పూలింగ్ ఉంటుందని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ స్పష్టంచేశారు. రాజధాని అమరావతిలో కొనసాగుతున్న ల్యాండ్ పూలింగ్ ప్రక్రియపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సిఆర్‌డిఎ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో రాజధాని ప్రాంతంలో భూముల సమీకరణ పురోగతిపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిఆర్‌డిఎ అడిషనల్ కమిషనర్ కార్తీక్‌తో పాటు ఇతర అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ల్యాండ్ పూలింగ్ కోసం ఇప్పటికే నోటిఫై చేసిన భూముల్లో ఇంకా ఎంత మేర భూమిని సమీకరించాల్సి ఉందనే అంశంపై మంత్రి ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, రైతుల స్పందన, భూముల సమీకరణలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి మంత్రి నారాయణ తెలుసుకున్నారు.

రాజధాని అమరావతిలో ప్రస్తుతం కొనసాగుతున్న రోడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణ పనులకు అవసరమైన భూములపై కూడా మంత్రి సమీక్షించారు. ఆయా నిర్మాణ పనులకు ఇప్పటికే ఎంత మేర భూమి అందుబాటులోకి వచ్చింది, ఇంకా ఎంత మేర భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించాల్సి ఉందనే వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియలో రైతులతో సమన్వయం కీలకమని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. భూములు ఇచ్చేందుకు ఇంకా ముందుకు రాని రైతులతో అధికారులు నేరుగా మాట్లాడాలని మంత్రి ఆదేశించారు. రైతులు లేవనెత్తుతున్న సందేహాలు, అభ్యంతరాలను పూర్తిగా తెలుసుకుని వాటిని నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# దుర్గమ్మ గుడిలో మోడీ పేరిట ఖడ్గమాల అర్చన



దసరా ఉత్సవాల్లో దుర్గమ్మ ఆలంకరణకు చీరలందిస్తున్న దాతలు

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్ర మోడీ పేరిట రాజ్యసభ ఎంపి లింగమనేని రమేష్ బుధవారం విశిష్ట ఖడ్గమాలార్చనను చేయించారు. పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈ ప్రత్యేక పూజాదికాలు చేయించినట్లు ఎంపి రమేష్ తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రధాని నరేంద్ర మోడీకి ఆయురారోగ్యాలతోపాటు దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపించడానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు లభించాలని కోరుతూ విశిష్టమైన ఖడ్గమాల అర్చన చేయించామన్నారు. భారత దేశం మరింత బలమైన, సుసంపన్నమైన, ఆత్మనిర్భరమైన దేశంగా అభివృద్ధి చెందాలని, 'వికసిత్ భారత' సంకల్పం సాకారం కావాలని ఆకాంక్షించారు. ఖడ్గమాల అర్చన ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, అమ్మవారి శేషావస్త్రాలు ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపుతున్నట్లు లింగమనేని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, జనసేన నేతలు పాల్గొన్నారు.

**హుండీ లెక్కింపుల్లో రు.2.60కోట్లు:** దుర్గమ్మకి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించగా రు.2కోట్ల 60 లక్షల 73వేల 491 ల నగదుతో పాటు 186 గ్రాముల బంగారం, 2కెజిల 165 గ్రాముల వెండి, యుఎస్ఎ డాలర్స్ 435, మలేషియా రింగెట్లు 3, యుఎఇ దిర్హామ్స్ 280, భూటాన్ న్గుల్ట్రమ్ 50, యూరోలు 50, ఇంగ్లాండ్ పౌండ్స్ 25, టాంజానియా షిల్లాంగ్స్ 1000, వియత్నాం డాంగ్‌లు 10000, కతార్ రియాల్స్ 36, ఒమని బైంసాలు 400, కెనడా డాలర్స్ 120, ఆస్ట్రేలియన్ డాలర్స్ 560, సింగపూర్ డాలర్స్ 52, న్యూజిలాండ్ డాలర్స్ 45, జపాన్ ఎన్స్ 1000, మాల్దీవ్స్ రుఫియాలు 20, కువైట్ దీనార్లు 0.8, నైజీరియా నైరాలు 500లు లభించినట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**సౌకర్యాలు పరిశీలించిన సిపి:** బుధవారం నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు సీతమ్మ వారి పాదాలు దగ్గర ఏర్పాటు చేస్తున్న కేశ ఖండనశాల, భక్తులకు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు పరిశీలన చేసారు. స్నానఘాట్లు, క్యూ లైన్లు పరిశీలన చేశారు.

**దుర్గమ్మకి దసరాల్లో అలంకరణకు పట్టుచీరలు:** దుర్గమ్మకి దసరా ఉత్సవాల్లో అలంకరణ, పూజా మండపంలో ఉత్సవ మూర్తి అలంకరణ నిమిత్తం విజయవాడకు చెందిన ఆర్. చిరంజీవిరావు వివిధ రకాల పట్టు చీరలు బుధవారం ఇఒ శీనా నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కోట ప్రసాద్ పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్

'సర్' ప్రక్రియలో అనర్హులుగా గుర్తించిన వారి ఓట్లు పరిశీలన

**అమరావతి, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించిన వారిని ఈ నెల8వ తేది గురువారం నుంచి బిఎల్‌ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ప్రతి అర్హతగల ఓటర్‌ను చేర్చి, ఓటర్ల జాబితాలో అనర్హుల నమోదులు ఏవీ మిగిలిపోకుండా చూడాలన్న భారత ఎన్నికల సంఘం లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రత్యేక విస్తృత సవరణ, 2026 కింద జరిగిన గణన దశలో, బిఎల్‌ఓలు 15 జూన్ నుంచి 24 జులై, 2026 వరకు ఇంటింటి పర్యటన చేశారు. మరణం, శాశ్వత నివాస మార్పు, బహుళ నమోదులు, ఆచూకీ తెలియక పోవడం, ఇతర కారణాల వల్ల మొత్తం 44.89 లక్షల మంది ఓటర్లు వారు ఇచ్చిన చిరునామాలలో కనబడలేదని నివేదించారు. బిఎల్‌ఓలు ఇంటింటికీ గణన పూర్తి చేసి తర్వాత 3.71 కోట్ల మంది ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాలను జులై 31న రాష్ట్రంలో ప్రచురించారు. ఏ ఒక్క అర్హతగల ఓటరును విస్మరించకూడదనే ఇసిఐ నిబద్ధతలో భాగంగా, నోటీసు దశలో ఏస్‌డిడి ఓటర్లు / అనర్హులైన ఓటర్ల పునఃపరిశీలన, కొత్త ఓటర్లు / విస్మరించిన ఓటర్ల నమోదు కోసం ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాలని కమిషన్ నిర్ణయానికి అనుగుణంగా దీనిని నిర్వహిస్తున్నట్టు సిఇఒ వివేక్ యాదవ్ చెప్పారు. ఈ డ్రైవ్‌లో భాగంగా, బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) తొలగించబడిన 46.62 లక్షల మంది పేర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి ఆ ఓటర్ల స్థితిని పునఃపరిశీలిస్తారని వివేక్ యాదవ్ ప్రకటించారు. ఈ దశలో ఏదైనా ఓటర్ పొరపాటున తొలగింపు జరిగితే వారికి ఫారం-6 నింపడానికి అవకాశం కల్పించి, సరైన పరిశీలన తర్వాత నిరంతర నవీకరణలో భాగంగా వారి పేరును ఓటర్ల జాబితాలో చేర్చుతామని వెల్లడించారు. నోటీసుల దశలో ఈనెల 6 నాటికి మరో 1,73,071 మంది ఓటర్లు అర్హులు కారని తేలిందని వివేక్ యాదవ్ పేర్కొన్నారు. వీరికి ఈనెల 16న ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు అర్హులు కారని చెప్పారు. తుది ఓటర్ల జాబితాను ఈనెల 16న ప్రచురిస్తామన్నారు. జనవరి 1, ఏప్రిల్ 1, జులై 1, అక్టోబరు 1 అనే నాలుగు అర్హత తేదీలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి యేటా జనవరి ఒకటిని అర్హత తేదీగా పరిగణించి వార్షిక సారాంశ సవరణ జరుగుతుందని తెలిపారు. ఈనెల 16న తుది జాబితాలో పేరు లేని ఏ ఓటరైనా, తర్వాత అర్హత పొందిన ఏ వ్యక్తైనా నిరంతర నవీకరణ సమయంలో నమోదు కోసం ఫారం 6ను సమర్పించవచ్చునని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.



## పుష్కరాలకు పటిష్ట భద్రతా ప్రణాళిక

### డిజిపి హరీష్‌కుమార్ గుప్తా సూచనలు

**రాజమహేంద్రవరం (అర్బన్), అక్టోబరు 7 ప్రభాతవార్త:** గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పుష్కరాల ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. పుష్కరాల నిర్వహణ కోసం మైక్రో టీమ్స్ ఏర్పాటు చేసి, వాటి పనితీరును వారానికోసారి సమీక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్, ఎమర్జెన్సీ రూట్లకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని, దివాన్‌చెరువు ఫ్లైఓవర్ల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలని సూచించారు.

ఎన్‌హెచ్16, ఎడిబి రోడ్డు తదితర మార్గాల్లో భారీ వాహనాల కోసం హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, భక్తుల రాకపోకలు, ఘాట్లకు చేరుకునే మార్గాలపై సూక్ష్మస్థాయి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. డ్రోన్లు, సిసి కెమెరాలు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలన్నారు.

స్థానిక ప్రజలు, రోగులు, ఉద్యోగులు, నిత్యావసర రవాణాకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఘాట్లు, మౌలిక వసతులు, పోలీస్ కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి పుష్కరాలను సురక్షి తంగా, సౌకర్యవంతంగా నిర్వహించాలని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

# ఎపిలో సాంకేతిక పర్యాటకానికి పెద్దపీట

- సెవిల్లెలో టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్ 2026 వేదికగా డిజిటల్ విప్లవానికి శ్రీకారం
- స్మార్ట్ డెస్టినేషన్ల వైపు ఎపి అడుగులు వేస్తుందని పేర్కొన్న పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

**అమరావతి, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి పర్యాటక రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతికతను తీసుకువచ్చి ప్రభుత్వం చారిత్రాత్మక అడుగు వేసిందని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్పెయిన్‌లోని సెవిల్లెఫిబెస్ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగు తోన్న అంతర్జాతీయ టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్ 2026లో మంత్రి దుర్గేష్ ప్రసంగిస్తూ ఎక్స్‌ప్లర్జర్ సంస్థ రూపొందించిన నివ ఏఐ ప్లాట్‌ఫారమ్ సేవలతో రాష్ట్ర పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని తద్వారా ప్రాచీన చారిత్రక కథలు అత్యాధునిక సాంకేతికత ద్వారా ప్రపంచానికి సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడిస్తూ ఏఐ సాంకేతికత ఆధారిత పర్యాటక విప్లవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అడుగడుగునా విస్మయపరిచే ప్రకృతి సౌందర్యానికి, వైవిధ్యానికి ప్రతీక అయిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ గొప్పదనాన్ని, భౌగోళిక వైవిధ్యాన్ని కళ్లకు కట్టినట్లుగా వివరించారు. అంతకుముందు మంత్రి దుర్గేష్ పర్యాటక శాఖ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్ తో పాటు వివిధ దేశాల స్టాల్స్ ను సందర్శించారు. ఈ నేపథ్యంలో వేదిక వద్దకు చేరుకున్న మంత్రి దుర్గేష్‌కు, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్ కు సెవిల్లెఫిబెస్ డైరెక్టర్లు, ప్రాంతీయ అధికారులు ఐరీన్ మునోజ్ ఘన స్వాగతం పలికారు అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తిరుమల దివ్య పుణ్యక్షేత్రం నుంచి ఆరంభమై, అమరావతి ప్రాచీన బౌద్ధ వారసత్వాన్ని స్పృశిస్తూ, గండికోట అద్భుతమైన క్యానియన్ ప్రకృతి దృశ్యాలను దాటుకుంటూ, మారేడుమిల్లి అరణ్యాలు, అరకు లోయల సౌందర్యంలో సాగి, బంగాళాఖాతపు హొయలొలికించే విశాఖ తీరంలో పరిపూర్ణమయ్యే ఒక అద్భుతమైన అనుభూతుల సమ్మేళనమే ఆంధ్రప్రదేశ్ అని అభివర్ణించారు. పవిత్ర పుణ్యక్షేత్రాలు, బౌద్ధ చరిత్ర, స్థానిక సంప్రదాయాలు, సజీవ కళలు, ప్రత్యేకమైన వంటకాలు, అడవులు, నదులు, సముద్రతీరాలు, ఆప్యాయంగా స్వాగతించే ప్రజల సమ్మేళనంగా ఉన్న ఏపీ ఒకే ప్రయాణంలో ఇంతటి వైవిధ్యాన్ని అందించడంలో సాటిలేని గమ్యస్థానమని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచస్థాయి 'క్వాంటం టెక్నాలజీ' కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని, సాంకేతిక ఆవిష్కరణల ద్వారా యువతకు నూతన ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు.




- తాజాగా టిబి డ్యాంలో సాంకేతిక నిపుణుల బృందం సమావేశం
- గత జూన్ 25న సిఎంల భేటీలో పూడిక తీతకు సానుకూల నిర్ణయం
- సిఎం చంద్రబాబు చక్రం తిప్పేనా?.. సిడబ్ల్యుసి అనుమతి ఇచ్చేనా?

**అనంతపురం, అక్టోబరు 7 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్ర- కర్ణాటక- తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయంలో దశాబ్దాలుగా పేరుకు పోయిన పూడిక తీసివేత చర్యలకు తుంగభద్ర బోర్డు చర్యలు తీసుకుంటుందా లేదా..? ఇందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి ఇస్తుందా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. తుంగభద్ర జలాశయంలో పూడిక తీతకు తుంగభద్ర బోర్డు ఇప్పట్లో ప్రతిపాదనలు పంపుతుందా లేదా, తాజాగా తుంగభద్ర బోర్డులో సమావేశమైన సాంకేతిక నిపుణుల బృందం పూడికతీతపై ఏమి చర్చించింది.. సాంకేతిక నిపు ణుల బృందం తీసుకున్న నిర్ణయాలు ఏమిటన్నది ఆసక్తికరంగా చర్చ జరుగుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వంలో తెలుగుదేశం భాగస్వామిగా ఉండటంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని తుంగభద్ర జలాశయంలో పూడిక తీతకు సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి ఇచ్చే విధంగా ఒత్తిడి తెస్తారా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ 25వ తేదిన తుంగభద్ర జలాశయం వద్ద డ్యాంకు కొత్తగా 33 గేట్లను తక్కువ కాలంలోనే అమర్చి రికార్డు సృష్టించారు. కొత్తగేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్ణాటక ముఖ్యమంత్రి బికె.శివకుమార్, తెంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఆయా రాష్ట్రాల నీటి పారుదల నిపుణులు సమావేశమై తుంగభద్ర జలాశయంలో పూడిక తీత విషయంలో ముందుకెళ్లాలని, ఈ విషయంలో టెక్నికల్ కమిటీని కూడా నియమించాలని నిర్ణయం తీసుకున్నారు.. ఇది శుభ పరిణామం. టెక్నికల్ కమిటీ పూర్తి స్థాయిలో స్టడీ చేసి తుంగభద్ర బోర్డు ద్వారా సెంట్రల్ వాటర్ కమిషన్‌కు ప్రతిపాదనలు పంపితే ఆ ప్రతిపాదనలు అమలు అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తుంగభద్ర జలాశయం లెక్కల ప్రాకారం తుంగభద్ర జలాశయంలో దాదాపు 21 టిఎంసిల నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని పూడిక వల్ల కోల్పోయిందని, దాదాపు 59.5 కోట్ల గణమీటర్ల నిల్వ స్థలం అని నిపుణులు చెబుతున్నారు. తుంగభద్ర జలాశయంలో పూడిక తీసివేత అన్నది దశాబ్దాల కాలంగా చర్చ జరుగుతోంది. చెప్పినంత సులువు కాదని కూడా అభిప్రాయ పడే నిపుణులు ఉన్నారు. తుంగభద్ర బోర్డు వివరాల ప్రకారం 1989 లెక్కల ప్రకారం ఒక్క టీఎంసీ పూడిక తొలగింపుకు రూ.100 కోట్లు అవుతుందని నిపుణులు అంచనా వేశారు. అంటే 21.5 టిఎంసి లకు గాను రూ.2,150 కోట్లు ఖర్చు అవుతుందని 1989 నాటికి లెక్కలు ఉన్నాయని నిపుణుల అంచనా. తాజాగా పూడిక రవాణా, ఢంపింగ్, ఇతర మౌలిక వసతుల ఖర్చులు అదనంగా పూడిక, నేటి ధరలతో తాజా అంచనాలువేస్తే ఇంకా ఖర్చు ఎక్కువయ్యే అవకాశం వుంది. తుంగభద్ర జలాశయంలోని పూడికను తీసివేస్తే ఎక్కడ నిల్వ చేయాలన్నది కూడా సమస్యగా ఉంది. ఒక్క టీఎంసీ పూడిక దాదాపు 2.83 కోట్ల గణమీటర్లు అవుతుందని, అంత మట్టిని నీటిలో నుంచి తొలగించి వేలాది ట్రక్కులతో తరలించేం దుకు అవసరమైన ఢంపింగ్ యార్డును కూడా గుర్తించాల్సి వుంది. జలాశయం చుట్టూ పచ్చని వరి పొలాలు, విలువైన సారవంతమైన భూములు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తుంగభద్ర జలాశయం పూడిక తీసివేత ద్వారా నీటి నిల్వలను పెంచు కొనడం ఆంధ్ర-కర్ణాటక-తెంగాణ రైతులకు ఎంతో అవసరం ఉన్నందున పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో పూడిక తీసివేతను దశల వారీగా చేపట్ట వచ్చని కూడా కొందరు నిపుణులు అభి ప్రాయపడుతున్నారు. 1989 లెక్కల ప్రకారం నిర్ణయించిన 21.5 టిఎంసిల నిల్వ వుండే పూడికను ఒకే సారి కాకుండా దశల వారీగా తొలగించేందుకు పైలెట్ ప్రాజెక్టును చేపట్ట వచ్చని నిపుణులు, నీటిపారుదల శాఖ అధికారులు అభి.ప్రాయ పడుతున్నారు. జపాను, స్వడ్జర్లాండ్ దేశాల్లో అమలు అవుతున్న జలా శయాల్లో పూడిక తీసివేత పద్దతులను భారత దేశ సాంకేతిక నిపుణులు అధ్యాయనం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయ పడుతు న్నారు. భారత దేశంలో సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న నేపథ్యంలో తుంగభద్ర జలాశయంలో పూడిక తీసివేతకు చర్యలు తీసుకోవచ్చని ప్రపంచంలోని వివిధ దేశాల్లో అధ్యాయనాలను తెలుసుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవాల ని రైతు సంఘాలు కూడా కోరుతున్నాయి. ప్రధానంగా వెనుకబడి ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంచి నీటి సదుపాయాలు, సాగునీటి సదుపా యాలు పెంపొందించేందుకు హెచ ఎల్‌సి ద్వారా ఎక్కువ నీరు తుంగభద్ర జలాశయం నుంచి వచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని తుంగభద్ర జలాశయంలో పూడిక తీసివేత విషయంలో తుంగభద్ర బోర్డు చొరవ తీసుకునే విధంగా సెంట్రల్ వారట్ కమిషన్ స్పందిస్తారని ఆశిద్దాం.

# గోదావరి డెల్టా ఆధునీకరణకు సమగ్ర కార్యాచరణ

- శాశ్వత ముంపు సమస్య పరిష్కారానికి లైడార్ సర్వేతో డిపిఆర్
- కాలువలు, డ్రెయిన్లు, బండ్‌లు, లాకులు, సి మోత్‌ల ఆధునీకరణకు ప్రాధాన్యత
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



గోదావరి డెల్టా ఆధునీకరణపై ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రామానాయుడు

**విజయవాడ, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి డెల్టాలో శాశ్వత ముంపు సమస్యకు పరిష్కారం చూపే విధంగా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఇందుకోసం రూ.13.4 కోట్ల వ్యయంతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా డిపిఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం విజయవాడలోని ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో గోదావరి డెల్టా ఆధునీకరణపై ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఐఐఎస్‌సి టెక్నాలజీస్ ప్రతినిధులు పాల్గొన్నారు. గోదావరి డెల్టా ఆధునీకరణలో భాగంగా ఇప్పటికే ఈస్ట్రన్ డెల్టాకు రూ.1,137 కోట్లు, సెంట్రల్ డెల్టాకు రూ.1,268 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. వెస్ట్రన్ డెల్టాకు సంబంధించిన అంచనాలను కూడా త్వరితగతిన సిద్ధం చేసి అందించాలని సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. డెల్టా ఆధునీకరణలో కాలువలు, డ్రెయిన్లు, బండ్‌ల స్థాయి, డీసిల్టింగ్, లాకులు, షట్టర్లు తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. పూడికతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన సి మోత్‌ల వద్ద డ్రెడ్జింగ్ పనులకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి దిగువ ప్రాంతాల్లోని ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాల్లో, సముద్రంలో కలిసే డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి నిమ్మల తెలిపారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో వాటి మరమ్మతులు చేపట్టడం లేదా అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపట్టడంపై సమగ్రంగా పరిశీలించాలని మంత్రి నిమ్మల అధికారులను ఆదేశించారు. లైడార్ సర్వే నిర్వహించిన ఐఐఎస్‌సి టెక్నాలజీస్ ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు, డిపిఆర్‌లు సిద్ధం చేసే సమయంలో స్థానిక సాగునీటి సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల అనుభవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి నిమ్మల సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలు, నీటి ప్రవాహ మార్గాలు, ముంపు ప్రాంతాలు, డ్రెయిన్ల పరిస్థితిపై సాగునీటి సంఘాలు, ప్రజాప్రతినిధులకు ఉన్న అనుభవాన్ని సాంకేతిక సమాచారంతో సమన్వయం చేసి సమగ్ర డిపిఆర్‌లు రూపొందించాలని మంత్రి తెలిపారు. డిపిఆర్‌లు పూర్తయిన అనంతరం వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. గోదావరి డెల్టా ఆధునీకరణ ద్వారా ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, సాగునీటి పారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
NIT No.82/EE/R&B/VZM/2026-27, తేది: 03.10.2026
విజయనగరం జిల్లాలో (ఆర్ & బి) డివిజను పరిధిలో ఒక (1) పని కొరకు టెండరు పిలువబడినది. పని విలువ: రూ.20.00 లక్షలు. టెండరు స్వీకరణ కొరకు ఆఖరు తేది: 15.10.2026, సా.4.00గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు (ఆర్ & బి), విజయనగరం.
DIPR.NO. 21690/CL/ADVT/1/1/2022-23 తేది: 07.10.2026

8-10Pg7exHMNWJQE.qxd:8-10Pg7exHMNWJQE.qxd 1/1/02 6:54 AM Page 1



# నెల రోజుల్లో తిరుమల గ్రామ సచివాలయ సమస్య పరిష్కారం : కలెక్టర్



**తిరుమల, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో నివాసముంటున్న స్థానిక ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయానికి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని బుధవారం టిడిపి నాయకులు తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి ఇన్‌చార్జ్ జెబి శ్రీనివాస్, ఎస్వీబీసీ చైర్మన్ బి.శ్రీధర్ వర్మ తదితరుల సమక్షంలో తిరుమల స్థానికులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తిరుమలలో సుమారు పదివేల మందికి పైగా శాశ్వత నివాసితులు ఉన్నారని, వీరిలో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, పింఛన్‌దారులు, రేషన్ కార్డు దారులు, దివ్యాంగులు, నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారని ప్రతినిధులు వివరించారు. ప్రజల సౌకర్యార్థం తిరుమలలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేసినప్పటికీ, దానికి అవసరమైన సచివాలయ కోడ్ కేటాయించకపోవడం వల్ల స్థానిక ప్రజలు పూర్తి స్థాయిలో ప్రభుత్వ సేవలను పొందలేకపోతున్నారని వారు కలెక్టర్‌కు వివరించారు. ఫలితంగా సాధారణ ప్రభుత్వ పనుల కోసం తిరుమల ప్రజలు సుమారు 31 కిలోమీటర్ల దూరంలోని శెట్టిపల్లి సచివాలయాన్ని ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితి ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, తిరుమలలో సచివాలయం ఏర్పాటు చేసిన ఉద్దేశ్యం స్థానిక ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడమేనని ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుకూలంగా విన్న తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తిరుమలలో ప్రస్తుతం ఉన్న గ్రామ సచివాలయాన్ని తొలగించకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. తిరుమల గ్రామ సచివాలయానికి సంబంధించిన ప్రత్యేక సచివాలయ కోడ్‌ను సంబంధిత అధికారులతో చర్చించి నెల రోజుల్లోపు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. సచివాలయ కోడ్ కేటాయింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం తిరుమల ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను తిరుమలలోనే అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులతో తక్షణమే మాట్లాడటం పట్ల తిరుమల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను ఒక నెలలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం వల్ల తమకు ప్రభుత్వ సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయన్న ఆశాభావం తిరుమల స్థానికులు వ్యక్తం చేశారు.

# సిఎం చంద్రబాబును కలిసిన ఎపి ఆసియా క్రీడల విజేతలు

### - ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి నిలిపారంటూ ముఖ్యమంత్రి అభినందనలు



2026 ఆసియా క్రీడల విజేతలతో సిఎం చంద్రబాబు

**అమరావతి, అక్టోబర్7,ప్రభాతవార్తప్రతినిధి:**2026 ఆసియా క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఖ్యాతి తెచ్చిపెట్టిన క్రీడాకారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆసియా క్రీడల విజేతలు రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సాధించిన పతకాలు, వారి అత్యుత్తమ ప్రదర్శనను సీఎం కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై మాతృభూమి పేరును నిలబెట్టిన క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయంగా రాణించాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబును కలిసిన వారిలో క్రీడాకారులు శ్రీ చరణి, గణేష్ మణిరత్నం, ధీరజ్ బొమ్మదేవర, వెన్నం జ్యోతిసురేఖ ఉన్నారు. మొత్తంగా 3 రకాల క్రీడాంశాల్లో 3 స్వర్ణాలు, 2 రజతాలు, 3 కాంస్యాలతో సహా మొత్తం 8 పతకాలను మన రాష్ట్ర క్రీడాకారులు కైవసం చేసుకున్నారని సీఎం చంద్రబాబుకు శాప్ ఎండీ భరణి వివరించారు. భవిష్యత్తులో రాష్ట్రం నుంచి మరింత మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రభుత్వం తరఫున పూర్తి ప్రోత్సాహం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలియచేసిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు7,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు సీఎం చంద్రబాబు తెలియచేసారు. భారత దేశానికి సరైన సమయంలో సరైన నేతగా మోదీ ఉన్నారని పేర్కొన్నారు, ప్రదాని మోదీ విజన్ తో వికసిత్ భారత్ 2047 దిశగా దేశం వేగంగా పయనిస్తోందని స్పష్టం చేసారుసుదీర్ఘ ప్రజా సేవలో భాగమైన ప్రధాని మోదీ తో కలిసి పనిచేయడం గర్వకారణం అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కేంద్రంలోను ఏపీలోను డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ల తో అభివృద్ధి, పెట్టుబడులు సరికొత్త వేగం అందుకున్నాయని స్పష్టం ప్రధాని సహకారంతో మౌలిక సదుపాయాలు, అవకాశాల కల్పనతో ఏపీ ముందుకు సాగుతోందని వెల్లడి ప్రధాని మోదీనేతృత్వంలో దృఢమైన భారత్ తో పాటు సుసంపన్నమైన స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా శ్రమిస్తున్నామని సీఎం స్పష్టం చేసారు.



వెంకటపాలెం టిటిడి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రణామం చేస్తున్న మంత్రి నారా లోకేష్

## ప్రధాని 25 యేళ్ల ప్రజా సేవా శిఖరానికి నమో : మంత్రి నారా లోకేష్

### - ఆధునిక ఉక్కు మనిషి ప్రధాని మోదీ వజ్రసంకల్పం నెరవేరాలి..

### - వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు

**అమరావతి.అక్టోబరు7,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ శ్రేయస్సు ప్రజాసంక్షేమమే లక్ష్యంగా 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం పూర్తి చేసుకున్న ఆధునిక ఉక్కుమనిషి ప్రధాని నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ప్రధాని వికసిత్ భారత్ వజ్రసంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ అమరావతిలోని వెంకటపాలెం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేష్ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నారు. 2001 అక్టోబరు 7వ తేదీన గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన మోదీ గారి ప్రస్థానం నేటితో 25 ఏళ్లు (రజతోత్సవం) పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీద వెంకటపాలెం ఆలయంలో లోకేష్ పూజలు చేశారు. ప్రపంచంలోనే మన దేశం అన్నిరంగాల్లో నెంబర్ వన్‌గా ఉండాలనే లక్ష్యంతో నిస్వార్థంగా పనిచేస్తున్న ఆధునిక ఉక్కుమనిషి నరేంద్ర మోదీ గారికి ఆ శక్తియుక్తులన్నీ దేవుడు ప్రసాదించాలని లోకేష్ ప్రార్థించారు. మోదీ ప్రజాసేవా ప్రస్థానాన్ని దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ యాత్రగా నిర్వహించడం దేశాభివృద్ధి కోసం ప్రధాని చేస్తున్న కృషికి నిదర్శనం అని లోకేష్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# జనసేనలోకి వైసిపి, సిపిఎం నేతలు.. పలువురు విద్యావేత్తలు, వ్యాపారవేత్తల చేరిక

### - కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన పార్టీ ప్రధాన నాగబాబు

విజయవాడ.అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ, సీపీఎం నాయకులతోపాటు విద్యాసంస్థల నిర్వాహకులు, వ్యాపారవేత్తలు బుధవారం జనసేన పార్టీలో చేరారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నాయకులు మధుసూదన్, కటకం జ్యోతి, ఆల్లూరి శంకర్, మర్రి బెంజిమన్, సీపీఎం నేత శ్రీ కొంపెల్ల భాను లక్ష్మి నారాయణ, పలువురు విద్యాసంస్థల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, సామాజిక కార్యకర్తలు, వ్యాపారవేత్తలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలతో పాటు గన్నవరం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ సందర్భంగా జనసేనలో చేరారు. వీరితో పాటు సుమారు 300 మంది జనసేన పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. పవన్ కళ్యాణ్ గారు కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా ఆదరిస్తారు. పార్టీలోకి భారీగా చేరిన నేతలు ఉద్దేశించి నాగబాబు మాట్లాడుతూ "పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ కార్యకర్తలందరినీ సొంత కుటుంబ సభ్యులుగా ఆదరిస్తారు. క్షేత్ర స్థాయిలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది. ఆ గుర్తింపు కొంచం వెనుకా ముందు దక్కవచ్చు. నాతో సహ ఈ వేదిక మీద ఉన్న ప్రతి ఒక్కరికీ అలానే గుర్తింపు దక్కింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కచ్చితంగా న్యాయం జరుగుతుంది" అన్నారు

**జన సైనికులకు ఆటోలు, స్వయం ఉపాధి ఉపకరణాలు అందజేత**

జనసైనికులు, వీరమహిళలు, చిరు వ్యాపారులకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమంలో నాగబాబు గారు పాల్గొని లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేశారు. 40 మంది జనసైనికులకు ఆటోలు, 25 మంది వీరమహిళలకు కుట్టు మిషన్లు, 25 మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను నాగబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, కనకదుర్గ ఆలయం ట్రస్ట్ బోర్డు మెంబర్ ఠాకూర్ పద్మావతి, హజ్ కమిటీ సభ్యులు

అబిద్, వీర మహిళా విభాగం నాయకురాళ్లు రావి సౌజన్య, మల్లెపు విజయలక్ష్మి, పార్టీ నాయకులు బొలిశెట్టి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ని కుమార్తె పెళ్లికి ఆహ్వానించిన వైఎస్ షర్మిల



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టులో వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోవాలని, తమ వాదనల తర్వాతే ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిలుపుదల చేయాలని వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సర్ ప్రక్రియ ముగియకుండానే స్థానిక ఎన్నికలకు సిద్ధమయ్యారని, స్థానిక సంస్థల్లో జనవరిలో ఉన్న డేటానే పరిగణనలోకి తీసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 1న రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. వార్డుల విభజన చేసుకోవచ్చని, స్థానిక ఎన్నికలకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు హైకోర్టు పచ్చజెండా ఊపడంపై, హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సోమవారం పిటిషన్ దాఖలు చేసి వెంటనే సీజెఐ కోర్టులో మెన్షన్ చేసిన వైఎస్సార్‌సీపీ, ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలకు అవకాశం ఉందని న్యాయవాది పేర్కొన్నారు. వెంటనే విచారణ చేపట్టాలని కోరగా,

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చూద్దాం అన్నారు. సర్ ప్రక్రియ ముగిశాకే స్థానిక ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ సందర్భంగా వార్డుల

సరిహద్దులు ఫ్రీజ్ కావు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

# సేవా స్ఫూర్తితో తిరుపతి నుంచి కాశీకి బైక్ యాత్ర

### కృష్ణా, గోదావరి పవిత్ర జలాలతో కాశీకి..

### టిడిపి నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ



**(విశాఖపట్నం-ప్రభాతవార్త)** సేవ, సుపరిపాలన సందేశంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు తిరుపతి నుంచి కాశీ వరకు బైక్ యాత్ర చేపట్టడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. గత కొన్ని రోజులుగా సాగుతున్న ఈ యాత్రలో భాగంగా కృష్ణా, గోదావరి నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలను కాశీకి తీసుకెళ్లడం ఎంతో హృదయస్పర్శగా ఉందని పేర్కొన్నారు. సేవా భావన, సుపరిపాలన పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ బైక్ యాత్రను నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఈ యాత్రలో భాగస్వాములయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను ప్రధాని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కాశీ వరకు సాగిన ఈ యాత్రలో ఆధ్యాత్మికతతో పాటు సేవ, సుపరిపాలన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రత్యేకంగా నిలిచిందని ప్రధాని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదుల పవిత్ర జలాలను కాశీకి తీసుకెళ్లడం ఆంధ్రప్రదేశ్-కాశీ మధ్య ఉన్న ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ : ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం, అక్టోబరు 7 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి పల్లెల రూపురేఖలు మార్చడమే 'పల్లె పండుగ 3.0 లక్ష్యమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం భీమవరం మండలంలోని తోకతిప్ప, నాగిడిపాలెం, దెయ్యలతిప్ప, కోమటితిప్ప నార్త్, రామాయణంపురం, దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామాల్లో 'పల్లె పండుగ 3.0లో భాగంగా పలు రోడ్లకు శంకుస్థాపనలు చేసి, నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# కారుణ్య నియామకాల్లో విద్యుత్ శాఖ వేగం.. నాలుగు నెలల్లోనే ఉత్తర్వులు : మంత్రి గొట్టిపాటి రవికుమార్

### - కూటమి ప్రభుత్వం వచ్చాక 627 మందికి నియామక ఉత్తర్వులు

**అమరావతి,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కారుణ్య నియామకాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే పరిస్థితికి స్వస్తి పలికి, అర్హత ఉన్న కుటుంబ సభ్యులకు నాలుగు నెలల్లోనే నియామక ఉత్తర్వులు ఇస్తున్నామని చెప్పారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ జెన్‌కోలో పనిచేస్తూ మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 27 మంది అర్హులకు మంత్రి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ నాగలక్ష్మి, పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 627 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశామని మంత్రి తెలిపారు. ఉద్యోగులను కోల్పోయిన కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. విద్యుత్ శాఖలో మానవ వనరుల కొరతను అధిగమించేందుకు సుమారు 7 వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోనున్నట్లు చెప్పారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు 629 ఏఈ పోస్టులను భర్తీ చేస్తున్నామని, నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేసినా ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదని గొట్టిపాటి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖను మరింత బలోపేతం చేసే దిశగా సాహసోపేత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా లోఓల్టేజ్ సమస్యను నివారించడంతో పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 132, 220, 400 కేవీ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని తెలిపారు. డిస్కంల పరిధిలోనూ 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. గృహ, వ్యవసాయ, ఆక్వా, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో విద్యుత్ కొనుగోలు చేసి డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి పీక్ అవర్స్‌లోనూ రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. పునరుత్పాదక విద్యుత్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.2 లక్షల వరకు రాయితీ లభించే సూర్యఘర్ కనెక్షన్లను ఏర్పాటు చేశామని, దేశవ్యాప్తంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానానికి చేరిందన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు బొగ్గు నిల్వలు పెంచడంతో పాటు విద్యుత్ ప్లాంట్లలో మరమ్మతులు చేపట్టి ఉత్పత్తిని పెంచామని చెప్పారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే సిబ్బంది పూర్తిస్థాయి శిక్షణ పొందిన తర్వాత విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. విద్యుత్ రంగంలో భద్రత, బాధ్యత అత్యంత కీలకమన్నారు. ప్రజల సంతృప్తి మరింత పెరిగేలా, సంస్థకు మంచి పేరు వచ్చే విధంగా ఉద్యోగులు విధులు నిర్వహించాలని కోరారు. విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

## మాజీ మంత్రి రోజా నోటి దురుసు - జగన్‌కు చిక్కులు: నగరి ఎమ్మెల్యే భాను

**తిరుపతి, అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి మాజీ మంత్రి రోజా బరితెగించి బజారువ్యక్తిలా మాట్లాడుతున్నారని,ఆమెకు బుర్ర, బుద్ధి రెండూ ఉందా అని నగరి ఎమ్మెల్యే గాలిభానుప్రకాశ్ ఎద్దేవాచేశారు. రోజా నోటిదూల వైఎస్ జగన్ కు చిక్కులు తెచ్చిపెడుతోందని, వైసిపి పతనానికి కారణం ఎవరైనా ఉన్నారంటే రోజానే అని ఆయన విమర్శించారు. బుధవారం రాత్రి తిరుపతిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే భానుప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. సిఎం,టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మాకు సంస్కారం నేర్పారని, రోజాలాగా బరితెగించి మాట్లాడడం మాకు తెలుస కానీ మేము అలా మాట్లాడమన్నారు. ఓ దశలో రోజా ఐరన్ లెగ్అంటూ నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంచలన వ్యాఖ్యలుచేశారు. ఆమె బాష వింటుంటే అసహ్యమేస్తోందని, వ్యాఖ్యలు విన్న మహిళలు అసహ్యించుకుంటున్నారన్నారు. బరితెగించి బజారువ్యక్తిలా మాట్లాడుతున్నారని అన్నారు. నోరు అదుపులో పెట్టుకోకుంటే మంచిదికాదన్నారు.

## ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు రూ.వెయ్యి కోట్లు విడుదల చేసిన వైద్యారోగ్యశాఖ

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు వైద్యారోగ్యశాఖ రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. వివిధ నెట్ వర్కు ఆస్పత్రులు ద్వారా ఎన్టీఆర్ వైద్య సేవ పథకాని(ఆరోగ్యశ్రీ)కి నిధుల వినియోగానికి వెసులుబాటు కల్పించింది. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టుకింద ఏపీ ప్రభుత్వం ఆయా నెట్ వర్కు ఆస్పత్రుల ద్వారా వైద్యసేవలు అందిస్తోంది.

## పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారం వేగవంతం

### - వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ గురవయ్య



**తిరుపతి, అక్టోబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని డైరెక్టర్ (టెక్నికల్) కె.గురవయ్య తెలిపారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికై ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య బుధవారం వినియోగదారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని 8 మంది పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను వివరించారు. క్యాబికల్ సమస్య, విద్యుత్ అంతరాయాలు తదితర అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళి కుమార్, కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు జగదీష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీకి వైసిపి అధినేత జగన్ శుభాకాంక్షలు



**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాత వార్తప్రతినిధి:**ప్రధాని మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ప్రధానికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భాన్ని ఒక చరిత్రాత్మక మైలురాయిగా జగన్ తన పోస్ట్‌లో అభివర్ణించారు. "గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానిగా నిరంతరాయంగా 25 ఏళ్లు పూర్తి చేసుకోవడంపై గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీ కి హృదయపూర్వక శుభాకాంక్షలు" అని ఆయన పేర్కొన్నారు.

## చిలకపాలెంలో విషాదం

### - గడ్డి మందు తాగి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

### - తల్లీ, బిడ్డ మృతి.. మరో చిన్నారి పరిస్థితి విషమం

ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా), అక్టోబరు 7 ప్రభాతవార్త: ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలో విషాద ఘటన చోటు చేసుకుంది. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో మీనా (29) అనే గృహిణి తన ఇద్దరు చిన్నారులకు గడ్డి మందు తాగించి, తానూ తాగిన ఘటన కలకలం రేపింది. అపస్మారక స్థితిలో ఉన్న ముగ్గురినీ శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మీనా, ఆమె ఏడు నెలల కుమారుడు కులదీప్ మృతి చెందారు. రెండేళ్ల గాయత్రి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మీనా భర్త జగదీశ్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

# మనమిత్ర ద్వారా కుల ధృవీకరణ పత్రాలు

### - మొబైల్ ఫోన్ ద్వారానే డౌన్లోడు చేసుకునే సదుపాయం

### - రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్వీసు అందుబాటులో ఉందన్న ఆర్టీజీఎస్

**అమరావతి,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలు పొందే సదుపాయాన్ని కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరులు తమ కుల ధృవీకరణ పత్రాలను తమకు కావాల్సినప్పుడు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లనవసరం లేకుండా తామున్న చోటు నుంచే తమ మొబైల్‌ఫోన్ ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చని ఆర్టీజీఎస్ తెలిపింది. మనమిత్రలోని రెవెన్యూ సేవల విభాగంలో పౌరులు రీ ఇష్యూయెన్స్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్ విభాగాన్ని ఎంపిక చేసుకుని అందులో తమ ఆధార్ నంబరు పొందుపరిచి ఓటీపీ పొందాలి. ఈ ఓటీపి అందులో నమోదు చేసిన తర్వాత కొన్ని వివరాలను నింపాలి. తర్వాత కుల ధృవీకరణ పత్రం పొందడానికి కావాల్సిన రూ.40ల రుసుమును వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే చెల్లించవచ్చు. ఒకసారి చెల్లింపు అయిన తర్వాతు వాట్సాప్‌లో మీ కుల ధృవీకరణ పత్రం డౌన్లోడు చేసుకోవచ్చు. ఇప్పటికే కుల ధృవీకరణ పత్రాలు జారీ అయిన వారు తమ కుల ధృవీకరణ పత్రాలను వాట్సాప్ ద్వారా తమకు కావాల్సిన చోట డౌన్లోడు చేసుకోవచ్చు.

# పుష్కరకాలం పరారీ ముద్దాయి అరెస్ట్



**తిరుమల,అక్టోబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో నమోదైన దొంగతనం కేసులో పుష్కరకాలంగా పరారీలో ఉన్న పాతముద్దాయిని తిరుమల క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై చాలా కాలంగా కేసులు పెండింగ్‌లో ఉండటం, ఎన్‌బిడబ్ల్యు వారెంట్ ఉండటంతో బుధవారం తెలంగాణ హైదరాబాద్‌లో పట్టుకున్నారు. తిరుపతి జిల్లాలో పాత కేసులు, పెండింగ్ వారెంట్లపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల క్రైమ్ సిఐ సంజీవకుమార్ సిబ్బందితో దర్యాప్తుచేపట్టారు. హైదరాబాద్ బోరబండ ప్రాంతంలో పరారీలో ఉన్న ముద్దాయి సయ్యద్ఇబ్రహీం(24)ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో నిందితుడిపై 2024లో తిరుపతి కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అప్పటి నుండి నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాత కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అరెస్ట్ వారెంట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

## సిట్ కస్టడీలో మూడో రోజు కొనసాగిన మాజీ మంత్రి కారుమూరి విచారణ

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సిట్ అధికారులు బుధవారం మూడో రోజు కూడా తమ కస్టడీకి తీసుకున్నారు. విజయవాడలోని సిట్ కార్యాలయంలో ఆయనను సుదీర్ఘంగా విచారిస్తున్నారు. మద్యం రవాణా టెండర్లలో జరిగిన అవకతవకలు, నిధుల మళ్లింపుపై ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అయితే కారుమూరి అనేక అంశాలను దాటవేస్తున్నట్లు సిట్ అధికారులు చెబుతున్నారు. ఆయన విచారణ ఏ మాత్రం సహకరించడం లేదంటున్నారు. కారుమూరి కస్టడీ ఈ నెల 9న ముగియనుంది.

## సుప్రీంకోర్టులో అనంతబాబు భార్య లక్ష్మీదుర్గకు చుక్కెదురు

**విజయవాడ,అక్టోబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సుప్రీంకోర్టులో ఆయన భార్య లక్ష్మీదుర్గకు చుక్కెదురైంది. ఈ కేసులో నవంబర్ 30లోపు ట్రయల్ పూర్తి చేయాలన్న గడువు పొడిగించాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ న్యాయస్థానాన్ని ధర్మాసనం తోసిపుచ్చింది. ట్రయల్ గడువు పొడిగించాలని కోరే హక్కు నిందితులుగా ఉన్న వారికి ఉండదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సంబంధిత ట్రయల్ కోర్టు జడ్జి లేఖ రాస్తేనే తాము తీసుకున్నామని.

ఒకేరోజు భార్యాభర్తలు ఒకే కేసులో పిటిషన్లు దాఖలు చేయడంపై న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అనంతబాబు బెయిల్ పిటిషన్‌పై లక్ష్మీదుర్గ పిటిషన్‌పై పడిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

8-10Pg5.qxd:8-10Pg5.qxd 1/1/02 5:48 AM Page 1





# ప్రజల ఆశీస్సులతోనే ఈ జర్నీ

## దేశంలోని ప్రతిపౌరునికి నాపై గొప్ప హక్కు ఉంది

## విజయ్‌సంకల్ప్ సభలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. నేడు ఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో పాల్గొన్న మోడీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోడీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుత "హ, బీజేపీ జెండాలు ఊపుతూ భారత్ మాతా కీ జై , స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోడీజీ కా స్వాగత్ హై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలు రాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారని తెలిపారు. నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మన స్ఫూర్తిగా నమ్ముతున్నానని మోడీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోడీ హయాంలో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రధాన దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం, గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్‌ను కీలక గొంతుకగా నిలబెట్టడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది.

## గణిత శాస్త్రవేత్త మహేష్ కాక్డేకు

# రామానుజన్ అవార్డు

### బెంగళూరు ఐఐఎస్‌సి ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి)లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న భారతీయ గణిత శాస్త్రవేత్త మహేష్ కాక్డే, సంఖ్యా శాస్త్రంలో చేసిన తన ముఖ్యమైన కృషికి గాను, అభివృద్ధి చెందుతున్న దేశాల యువ గణిత శాస్త్రవేత్తల కోసం ఉద్దేశించిన 2026 రామానుజన్ బహుమతిని అందుకున్నారు. ఈ బహుమతిని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్ (ఐసిటిపి), ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ యూనియన్ (ఐఎంయు) సంయుక్తంగా అందజేస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పనిచేస్తూ అత్యుత్తమ పరిశోధనలు చేసిన 45 యేళ్లలోపు గణిత శాస్త్రవేత్తలను ఇది గుర్తిస్తుంది. బీజగణిత సంఖ్యా శాస్త్రంలో చేసిన ప్రాథమిక కృషికి, ముఖ్యంగా సంఖ్యలు ఎలా ప్రవర్తిస్తాయి. విభిన్న గణిత నిర్మాణాలు ఎలా అనుసంధానించబడి ఉంటాయి అనే విషయాలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలను పరిష్కరించినందుకు కాక్డే ఈ గుర్తింపు పొందారు. మహేష్ కాక్డే మహారాష్ట్రలోని అకోలాలో 1983లో జన్మించారు. అక్కడే విద్యాభ్యాసం చేసిన కాక్డే, బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యాచిలర్ ఆఫ్ మ్యాథమెటిక్స్ పూర్తి చేశారు. ఆ తర్వాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్లి, అక్కడ 2008లో శుద్ధ గణితశాస్త్రంలో తన మాస్టర్స్ డిగ్రీ, పిహెచ్‌డిని పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ లండన్, కింగ్స్ కాలేజ్ లండన్‌లలో పనిచేసి, 2019లో ఐఐఎస్‌సిలో ప్రొఫెసర్‌గా చేరారు. కాక్డే పొందుతున్న గౌరవాల జాబితాలో రామానుజన్ బహుమతి కూడా చేరింది. ఆయన 2022లో గణిత శాస్త్రాలలో ఇన్ఫోసిస్ బహుమతిని అందుకున్నారు. అంతర్జాతీయ గణిత శాస్త్రవేత్తల సదస్సులో ఆహ్వానిత వక్తగా ప్రసంగించారు. 2023లో ఆయన 'ఏషియన్ సైంటిస్ట్ 100' జాబితాలో కూడా చోటు దక్కించుకున్నారు. 2005లో స్థాపించబడిన రామానుజన్ బహుమతి, 10,000 డాలర్ల నగదు బహుమతిని అందిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో సవాలుతో కూడిన పరిస్థితులలో నిర్వహించబడిన అసాధారణ గణిత పరిశోధనలను గౌరవిస్తుంది.

## మోడీ జీవితంలో చిరస్మరణీయం అక్టోబరు 7



**న్యూఢిల్లీ,అక్టోబరు 7:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవితంలో అక్టోబర్ 7 చిరస్మరణీయంగా మిగిలిపోనుంది. సరిగ్గా పాతికేళ్ల కిందట అంటే 2001 అక్టోబర్ 7వ తేదీన ఆయన ప్రజా జీవితంలో అడుగు పెట్టారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఏకధాటిగా ప్రజా జీవితంలోనే కొనసాగుతున్నారు. అప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇప్పుడు ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందిస్తూనే వస్తోన్నారు. ముఖ్యమంత్రిగా గానీ, ప్రధానిగా గానీ ఈ 25 సంవత్సరాల్లో ఒక్క రోజు కూడా విరామం రాలేదు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ కొద్దిసేపటి కిందటే వినాయకుడి ఆలయానికి వెళ్లారు. 140 కోట్లమంది దేశ ప్రజల ప్రతినిధిగా ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాన్నిఅభిషేకించారు. నవగ్రహ ప్రదక్షిణం చేశారు. సుమారు 40 నిమిషాల పాటు దైవచింతనలో మునిగిపోయారు. దేశ క్షేమాన్ని కాంక్షించారు. ఢిల్లీ సరోజినీ నగర్ లో ఉంటుంది ఆలయం. ఈ ప్రత్యేక సందర్భాన్ని వేడుకగా జరుపుకొంటోంది భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీకి చెందిన నాయకులు ప్రధాని మోడీ పేరిట దేశవ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తోన్నారు. ప్రధాని మోడీ ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థిస్తోన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తో మోడీ రాజకీయ జీవితం ఆరంభమైంది. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. 2014 మే 22వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు. దాదాపు 12 సంవత్సరాల పాటు నిరాటంకంగా పరిపాలన చేశారు. ఆ కాలంలో రాజ్ కోట్ వెస్ట్, మణినగర్ నియోజకవర్గాలకు ప్రాతినిథ్యాన్ని వహించారు. రాజ్ కోట్ వెస్ట నుంచి ఒకసారి, మణినగర్ నుంచి వరుసగా నాలుగుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా 2014 నాటి సార్వత్రిక ఎన్నికల్లో తెరమీదికి వచ్చారు. ప్రచార బాధ్యతలను భుజనవేసుకున్నారు. బీజేపీని బంపర్ మెజారిటీతో గెలిపించారు. అదే ఏడాది మే 26వ తేదీన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగుతున్నారు. సుదీర్ఘకాలం ప్రధానిగా పని చేసిన వారి జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారాయన. 16 సంవత్సరాల 286 రోజుల పాలనతో జవహర్ లాల్ నెహ్రూ అగ్రస్థానంలో ఉన్నారు. 15 సంవత్సరాల 350 రోజులతో ఇందిరాగాంధీ రెండోస్థానంలో ఉన్నారు. ప్రజా జీవితంలో మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గతనెల 17న ఆయన పుట్టినరోజున ప్రారంభించిన నెల రోజుల సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా బీజేపీ పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, పరిశుభ్రతా కార్యక్రమాలు, సంక్షేమ అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర ప్రజా సేవా కార్యక్రమాలను చేపట్టారు ఆ పార్టీ నాయకులు. టార్చ్ మార్చ్‌లు, బైక్/సైకిల్ ర్యాలీలను నిర్వహించారు.

## సాధించి తీరాలనే సంకల్పమే

## దేశ ముఖ చిత్రాన్ని మార్చింది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** తాను అధికార బాధ్యతలు చేపట్టేటపుడు ఏది ఏమైనా సాధించి తీరాలి అనే దృఢ సంకల్పం తీసుకున్నానని, ఈరోజు దేశ ముఖచిత్రమే మారిపోయిందని ప్రధాని మోడీ సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏదైనా చిన్న సంక్షోభం వస్తేనే భారత ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయేదని, కానీ ఈ రోజు ఏ సంక్షోభం వచ్చినా భారత్ చూపిస్తున్న సామర్థ్యం గురించి ప్రపంచమంతా చర్చించుకుంటోందని గుర్తు చేశారు. ఒకప్పుడు దేశంలో నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితిని పాలసీ పారాలిసిస్ అని విమర్శించేవారని, కానీ నేడు దేశంలో "రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్ పరిగెడుతోందని తెలిపారు. పూర్వపు రోజుల్లో విదేశాల నుంచి దిగుమతులు (ఇంపోర్ట్) పెంచుకోవడానికి మార్గాలు వెతికేవారని, కానీ ఈ రోజు భారత్ స్వయంగా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి (ఎక్స్‌పోర్ట్) చేస్తోందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా సేవలో విజయవంతంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో మాటా "డారు. ఈ సందర్భంగా 2014 కంటే ముందు దేశం ఉన్న పరిస్థితిని గుర్తుచేస్తూ.. ఆ రోజుల్లో ద్రవ్యోల్బణాన్ని అందరూ చేతులెత్తేసిన వ్యవహారం అని అనుకునేవారని అన్నారు. అప్పట్లో దేశానికి ఒక కొత్త ఉత్సాహం, కొత్త శక్తి అత్యవసరంగా కావాల్సి వచ్చిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి కూడా ప్రధాని మోడీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి చూసుకుంటే.. 2015 నుంచి 2025 మధ్య ఉన్న ఈ దశాబ్ద కాలం వ్యవసాయ రంగంలో పాత రికార్డులన్నింటినీ తిరగరాసి సరికొత్త రికార్డులను సృష్టించిందని అన్నారు. మన ఆలోచన, ఉద్దేశం స్పష్టంగా ఉండి (నియ్యత్ సాఫ్), విధానాలు నిఖార్సుగా ఉన్నప్పుడే (నీతి స్పష్ట్) ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అనేది మంచి పాలనకు మూలస్తంభమని, అయితే దేశాన్ని చాలా కాలం పాటు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే విడదీస్తూ వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక భారత్ ఎక్కడా తగ్గేదే లేదని, అసలు ఆగేదే లేదని మోడీ ధీమా వ్యక్తం చేశారు.

మన దేశ ప్రాచీన వైభవాన్ని గుర్తుచేస్తూ ఒకప్పుడు భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటికీ నాయకత్వం వహించేదని, అయితే విదేశీ దోపిడీదారుల పాల నలో దేశాన్ని దారుణంగా దోచుకున్నారని అన్నారు. ప్రపంచానికే మార్గదర్శనం చేసిన మన దేశంలో ఉన్న గొప్ప గ్రంథాలయాలను కూడా తగలబెట్టారని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందను గుర్తు చేసుకుంటూ ఏదో ఒక రోజు ఒక గొప్ప భారత్ పుట్టుకొస్తుందని వివేకానంద చెప్పిన మాటలను ప్రస్తావించారు.

# 'పశ్చిమ బంగ'గా బెంగాల్

### త్వరలో పేరు మార్చుతున్నట్లు ప్రకటించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు



**కోల్‌కత్తా, అక్టోబరు 7:** పశ్చిమ బెంగాల్ పేరు మారబోతుంది. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య కీలక ప్రకటన చేశారు. పశ్చిమ బెంగాల్ పేరును పశ్చిమ బంగాగా మార్చనున్నట్లు తెలిపారు. రాష్ట్ర చారిత్రక గుర్తింపును ప్రతిబింబించేలా పేరును మార్చాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే అసెంబ్లీలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెడతామని చెప్పారు. బుధవారం మీడియాతో మాట్లాడిన సమిక్ భట్టాచార్య ఇంకెన్ని సార్లు చెప్పాలి రాష్ట్రం పేరు పశ్చిమ బంగాగానే ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర పేరును పశ్చిమ బంగాగా మార్చే ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇకపై పశ్చిమ బంగ్లా, బంగ్లా, బంగా వంటి పేర్లను ఉపయోగించాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఇకపై మీరు "పశ్చిమ బంగ్లా, బంగ్లా, బంగా వంటి పేర్లను వినాల్సిన అవసరం ఉండదు. పశ్చిమ బంగా రాబోతోందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర చరిత్రతో దాని పేరుకు ఉన్న అనుబంధాన్ని కొనసాగించేలా అసెంబ్లీలో బిల్లును తీసుకురానున్నట్లు తెలిపారు. చాలా త్వరలోనే మా ప్రభుత్వం తొలి అసెంబ్లీ సమావేశంలోనే ఒక బిల్లును ప్రవేశ పెడుతుంది. ఈ రాష్ట్ర పేరు, రాష్ట్ర చరిత్రతో అంతర్గతంగా అనుసంధానమై ఉండేలా చూస్తాం. అదే రాష్ట్ర గుర్తింపుగా ఉంటుంది. అందుకే రాష్ట్రానికి పశ్చిమ బంగా అనే పేరు పెట్టబోతున్నాం అని సమిక్ భట్టాచార్య చెప్పారు. ప్రభుత్వాధినేతగా ప్రధాని మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన ప్రసంగంపై కూడా సమిక్ భట్టాచార్య స్పందించారు. మోడీ ప్రసంగాన్ని ప్రశంసించారు.

దేశంలోని అన్ని పరిపాలనా జిల్లాల్లో బీజేపీ కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషులు, ప్రభుత్వ అధికారులు సమావేశమై ప్రధాని ప్రసంగాన్ని విన్నారని తెలిపారు.

25 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం తర్వాత కూడా తన జీవితం దేశానికే అంకితమని మోడీ చెప్పారని పేర్కొన్నారు.

# 45 కాదు 100 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసినా తగ్గేదిలేదు!

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు వెళ్లనున్నట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయనను కలిసేందుకు అవకాశం ఇవ్వలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మంగళవారం నిరసనకు నిర్ణయించిన ప్రదేశానికి వెళ్లకుండా ఢిల్లీ పోలీసులు తమను అడ్డుకున్నారని రాహుల్ గాంధీ తెలిపారు. అక్కడ నిరసన చేపట్టేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పినట్లు పేర్కొన్నారు. నిన్న చెప్పినట్లుగానే లోక్‌సభ, రాజ్యసభకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు సిఇసిని కలవాలని అనుకున్నారు. కానీ ఆయన మమ్మల్ని కలవలేదు. ఢిల్లీ పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. అక్కడ నిరసన చేయడానికి వీల్లేదని నిన్న చెప్పారు అని రాహుల్ గాంధీ తెలిపారు. దీంతో అధికారికంగా నిరసనలకు కేటాయించిన జంతర్ మంతర్‌కు వెళ్లి అక్కడే ఆందోళన చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. తనపై కేసులు నమోదవుతున్న అంశంపైనా రాహుల్ గాంధీ స్పందించారు. తనపై 100 ఎఫ్ఐఆర్‌లు నమోదైనా తనకు అభ్యంతరం లేదని వ్యాఖ్యానించారు."నాపై 100 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయండి.

ప్రతి ఎఫ్ఐఆర్ నాకు ఒక పతకం లాంటిదే అని అన్నారు. ఇప్పటికే తనపై 45 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో ఉన్న సాగర్ రత్న రెస్టారెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలకు విందు ఏర్పాటు చేశారు. ఈ సమావేశం అనంతరం రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ఆందోళనను కొనసాగించనున్నట్లు తెలిపారు.

# నైరుతి పూర్తి.. శీతలగాలులు షురూ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** దేశవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నైరుతి రుతుపవనాలు దేశం నుంచి తిరోగమనం పూర్తైన వేళ, ఒకేసారి పలు ప్రాంతాల్లో రకరకాల వాతావరణ వ్యవస్థలు చురుగ్గా మారాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆగ్నేయ ఉత్తర ప్రదేశ్, అరేబియా సముద్రంతో పాటు కేరళ పరిసరాల్లో ఏర్పడిన వాయుగుండాల ప్రభావంతో నేడు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఉత్తర భారతదేశంలో వెస్ట్రన్ డిస్టర్బెన్స్ ప్రభావం తీవ్రంగా ఉంది. దీనికారణంగా జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని ఎత్తైన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు హిమపాతం కురిసే అవకాశం ఉంది. జమ్మూ కశ్మీర్‌లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండగా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు విజృంభించే అవకాశం ఉంది.

అటు పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ మైదాన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు ఆగ్నేయ ఉత్తర ప్రదేశ్, ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాలలో వాతావరణ మార్పుల వల్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. బీహార్, సిక్కిం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని ఐఎమ్‌డీ తెలిపింది. ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మణిపూర్ ప్రాంతాలకు వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికలు జారీ చేసింది. ఈ తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఈనెల 8 వరకు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. దక్షి ణ భారతదేశంలోనూ వాతావరణం మేఘావృతమై ఉండి వర్షాలు పడే సూచనలు స్పష్టంగా ఉన్నాయి.

## ఇరాన్‌యుద్ధంతో అమెరికాకు రూ.31వేల కోట్లునష్టం

**వాషింగ్టన్, అక్టోబరు 7:** ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన సైనిక చర్యల్లో ఆ దేశానికి భారీగా వైమానిక నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో ఇప్పటివరకు కనీసం 81 అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, మానవ రహిత డ్రోన్లు (యూఏవీ) ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం జరిగిందని అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ధ్వంసమైన ఈ పరికరాల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవడానికి అయ్యే ఖర్చు 3.3 బిలియన్ డాలర్ల అంటే సుమారు రూ. 31 వేల కోట్లు వరకు ఉండొచ్చని అంచనా. ఈనెల 5న విడుదల చేసిన ఈ తాజా నివేదిక అమెరికా సైనిక ప్రకటనలు, మీడియా కథనాలు, రక్షణ శాఖ నివేదికల ఆధారంగా రూపొందింది. మే నెలలో విడుదల చేసిన నివేదికలో ఈ సంఖ్య 42గా ఉండగా, తాజా నివేదికలో ఇది 81కి చేరడం గమనార్హం. మే తర్వాత జరిగిన నష్టాలతో పాటు గతంలో లెక్కలోకి రాని ఘటనలను కూడా చేర్చడం వల్లే ఈ సంఖ్య పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది.

దెబ్బతిన్న కొన్ని విమానాలు మరమ్మతుల అనంతరం తిరిగి విధుల్లో చేరాయని కూడా పేర్కొంది. సైనిక కార్యకలాపాలు ఇంకా కొనసాగుతుండ టంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నష్టాల్లో మానవ రహిత డ్రోన్ల వాటానే అధికంగా ఉంది. నివేదిక ప్రకారం, కనీసం 45 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ధ్వంసమయ్యాయి.

# సిఇసి, ఇసిల నియామకం చట్టాన్ని సవాల్ చేస్తూ వచ్చిన పిటిషన్లపై సుప్రీం విచారణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 2023 లో తీసుకొచ్చిన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ చట్టాన్ని విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా వద్దా అనే అంశంపై గతంలో వచ్చిన స్ప్లిట్ వర్డిక్ట్ తీర్పును ఉపసంహరించుకోవాలంటూ దాఖలైన దరఖాస్తును పునఃపరిశీలించడానికి అంగీకరించింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు చోటు చేసుకుంటోండటం, 2023 నాటి ఈ చట్టం ద్వారా ఈసీ నియామకాలను కేంద్రం తనకు అనుకూలంగా, ఏకపక్షంగా మార్చుకుందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పాత చట్టంలో సమూల మార్పులు చేస్తూ తీసుకొచ్చిన ఈ యాక్ట్ పై న్యాయమూర్తులు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారనేది చర్చనీయాంశమయింది. కేంద్రం 2023 లో తెచ్చిన చట్టం చెల్లుబాటును రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేయాలా వద్దా అనే అంశంపై కిందటి నెల 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ఇద్దరు న్యాయమూర్తులల ధర్మాసనం స్ప్లిట్ వర్డిక్ట్ ఇచ్చింది. భిన్నమైన తీర్పులను వినిపించింది. దీనిపై ఇద్దరు న్యాయమూర్తులు కూడా ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. జస్టిస్ దత్తా బదిలీ అభ్యర్థనను తోసిపుచ్చగా జస్టిస్ సతీష్ చంద్ర శర్మ దీనిని సమర్థించారు. సీఈసీ, ఈసీల ఎంపిక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్పులే. నూతన చట్టం ప్రకారం ఈసీల ఎంపిక కమిటీ నుండి సీజేఐని తొలగించారు. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు గానీ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర క్యాబినెట్ అధికారి. ఈ సెలెక్షన్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సీఈసీ, ఈసీ నియామకాలు చేపడుతుంది. ఈ కొత్త నిబంధనల వల్ల నియామక ప్రక్రియలో పారదర్శకత దెబ్బతింటుందని, ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిని కేంద్రం తన ఆధీనంలోకి తీసుకునే ప్రమాదం ఉందంటూ పలు పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ గోపాల్ శంకరనారాయణన్ రీకాల్ పిటీషన్ దాఖలు చేశారు. ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన స్ప్లిట్ వర్డిక్ట్‌ను రీకాల్ చేయాలని అభ్యర్థించారు. సుప్రీంకోర్టు ప్రధాన జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్మాల్యా బాగ్చీ, జస్టిస్ వీ మోహనతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సమక్షానికి వచ్చింది రీకాల్ పిటిషన్. భిన్నాభిప్రాయాల తీర్పు నేపథ్యంలో ఈ రీకాల్ పిటీషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరారు. ఇదే వ్యవహారంపై ఓ క్యురేటివ్ పిటిషన్ కూడా దాఖలైందని గుర్తు చేశారు. తాము దాఖలు చేసిన రీకాల్ పిటీషన్ ఇంటెరిమ్ అప్లికేషన్ గా భావించాలని వివరించారు. క్యురేటివ్ పిటిషన్ తో దీన్ని క్లబ్ చేయవద్దని కోరారు. ఈ క్యురేటివ్ పిటిషన్ విచారణను సొంతంగానే కొనసాగించాలని, విచారణకు అది ఎంతవరకు అర్హమైనదనే విషయంపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## సర్ పూర్తయిన 20 రాష్ట్రాల్లో ఓటర్ల నమోదు

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై దేశవ్యాప్తంగా రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. జాబితాలో పేర్లు లేకుండా పోయిన అర్హులైన ఓటర్లను తిరిగి చేర్చేందుకు ఈ చర్యలు చేపట్టింది. ఎస్ఐఆర్ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఫారం6తో పాటు ఎస్ఐఆర్ సమయంలో తీసుకువచ్చిన అదనపు డిక్లరేషన్ సమర్పించాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ జరుగుతున్న సమయంలోనే ఇది వర్తిస్తుందని చెప్పింది. ఎస్ఐఆర్ పూర్తయిన ప్రాంతాల్లో అర్హులైన ఓటర్లు సాధారణ ఫారం6 ద్వారా ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవచ్చని ఈసీ పేర్కొంది. సర్ లేని సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలెక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం నిర్దేశించిన సాధారణ ఫారమ్‌లే వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఎస్ఐఆర్ సమయంలో జాబితాలో పేర్లు లేకుండా పోయిన ఓటర్లను గుర్తించి చేర్చేందుకు ఎన్నికల అధికారులు, ఎన్నికలఅధికారులు,ఎలక్టోరల్‌రిజిస్ట్రేషన్‌అధికారులుచర్యలు తీసుకోవాలన్నారు.

# సంక్షిప్త వార్తలు

### ముంబయి నుంచి ఢిల్లీకి వేదిక మార్చిన సిజెపి




**ముంబయి, అక్టోబరు 7:** ఎస్ఐఆర్ లో అక్రమాలకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ ముంబై నుంచి ఢిల్లీకి మకాం మార్చబోతోంది. అక్టోబర్ 10న ముంబై నుంచి ఢిల్లీ జంతర్ మంతర్ కు చేరుకుని ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీలో ఏర్పాట్లు చేసుకుంటోంది. అయితే ఈ భారీ నిరసనకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పేస్తున్న వేళ సీజేపీ నేత సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈనెల 10న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టే ఆందోళనలకు అనుమతులు తీసుకోవాలంటూ తమకు ఎదురవుతున్న ప్రశ్నలపై స్పందించిన సీజేపీ నేత సౌరవ్ దాస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే నిరసనలకు తిరిగి ప్రభుత్వం అనుమతి ఎందుకని ప్రశ్నించారు.

### అరుణాచలం ఆలయంలో భక్తులకు కొత్త మార్గదర్శకాలు



**చెన్నై, అక్టోబరు 7:** తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం తిరువణ్ణామలై (అరుణాచలం) ఆలయంలో భక్తుల రక్షణ, రద్దీ నియంత్రణ కోసం ఆలయ స్థానిక అధికారులు పలు కొత్త ఆంక్షలు మరియు నిబంధనలను అమలులోకి తీసుకు వచ్చారు. గర్భగుడి ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వల్ల భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆలయ బోర్డు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. తాజా మార్గదర్శకాల మేరకు ఇక నుంచి గర్భగుడి అభిషేకంలో పాల్గొనాలనుకునే భక్తులకు అభిషేకం ప్రారంభానికి ఒక గంట ముందుగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వీటిని తప్పని సరి చేసారు.

### ఆసుపత్రులు చేసే అతి ప్రకటనలకు మెడికల్ కమిషన్ కత్తెర!

**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** దేశంలో వైద్యులు, ఆస్పత్రులు, వైద్య సంస్థలు చేసే ప్రచారాలు, ప్రకటనలపై నేషనల్ మెడికల్ కమిషన్ కొత్త నైతిక మార్గదర్శకాలను విడుదల చేసింది. వైద్య రంగాన్ని వాణిజ్యమయం చేయకుండా నిరోధించడం, తప్పుడు సమాచారం నుంచి రోగులను కాపాడటం, వైద్య వృత్తిలోని జవాబుదారీతనాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ నిబంధనలను రూపొందించారు. ముఖ్యంగా బెస్ట్ డాక్టర్', నంబర్ వన్", 100 శాతం నయం చేస్తాం', నొప్పి లేని చికిత్స' వంటి వ్యాపార ధోరణిలో చేసే అతిశయోక్తి ప్రకటనలను పూర్తిగా నిషేధించారు.

### ఇరాన్‌ను ఎవరు నడిపిస్తున్నారో తెలియడంలేదు :ట్రంప్



**వాషింగ్టన్, అక్టోబరు 7:** పశ్చిమాసియాలో అమెరికాఇజ్రాయెల్ దళాలు నిర్వహిస్తున్న యుద్ధం ఎనిమిదో నెలకు చేరుకున్న వేళ సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన ఈ తీవ్రస్థాయి పోరులో ఇరాన్ అగ్ర నాయకత్వం తుడిచిపెట్టుకుపోవడంతో, ప్రస్తుతం ఆ దేశాన్ని అసలు ఎవరు నడిపిస్తున్నారో ఎవరికీ తెలియడం లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అగ్ర నాయకులు, వారి తర్వాతి స్థానాల్లో ఉన్న నేతలంతా హతమవ్వడంతో ఒక స్పష్టమైన నాయకత్వం లేక ఇరాన్ కొట్టుమిట్టాడుతోందని ట్రంప్ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. అసలు ఇరాన్ ను ఎవరు నడిపిస్తున్నారో ఎవరికీ తెలియకపోవడమే ఇప్పుడు పెద్ద సమస్యగా మారింది అని ట్రంప్ అనడం అంతర్జాతీయంగా కలకలం రేపింది.



# గాయత్రీ.. నీకు వందనమ్మా !

చిన్న చిన్నవీ గుర్తుంచుకోలేకపోతున్నారు. అంతేనా, ఏకాగ్రత నిలపలేక పోతున్నారు. నెలసరి,

నిజమే: గాయత్రీ పెద్ద మనసును చూసును చూసి ఎవరూ మెచ్చుకోకుండా ఉండలేరు. ఈ కాలం.. కలి కాలం ! తల్లికి బిడ్డ.. బిడ్డకు తల్లి రుణానుబంధాలు ఆత్మీయ బందాలు.. కానరాని రోజులివి. మానవత్తవపు పరిమళాలు వెల్లివెరిసిన వేళ ఆ రోజు ద్వారకా తిరుమల ఆలయ నిత్యాన్న ప్రసాద కేంద్రమంతా అన్నర్తులతో నిండిపోయి ఉంది. ఎవరి సీట్లలో వారు కూర్చున్నారు. అందరూ భోజనానికి ఉపక్రమించినా భీమడోలు మండలం పాతూరు గ్రామానికి చెందిన వాడపల్లి రాంబాబు అనే దివ్యాంగుడు అన్నం తినలేక, తినేందుకు చేతుల్లేక ఆకులో పెట్టినవి ఏమీ నోటి వరకు వచ్చేదారిలేక అలాగే చూస్తూ ఉండి పోయాడు. అది చూసిన అన్నదాన కేంద్ర సేవకురాలు గాయత్రి అనే మహిళ అతని వద్దకు వెళ్లి అతనికి ముద్దలు తినపించడం, అందరి ప్రశంసలు అందుకొంది. 'మానవ సేవే మాధవ సేవ' అని నమ్మిన వారు మాత్రమే ఇలాంటి సేవలను బాధ్యతగా స్వీకరిస్తారు. తరిసానతరు. వెంటనే గమనించిన భక్తులు ఆమెను ప్రశంసిస్తూనే ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెడితే, అది చూసి ముఖ్యమంనరతి గాయత్రీ నీకు వందనమ్మా! అటు తన 'ఎక్స్' ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు. గాయత్రి సేవాభావాన్ని మాటల్లో చెప్పలేక వారు సైతం మనసులోనే అభినందించారు. దేవాలయ కార్యనిర్వాహణాధికారి కూడా తన సిబ్బందిలో ఆణిముత్యం ఉన్నందుకు ఎంతగానో సంతోషించారు. అమ్మ మాత్రమే చేయగలిగిన సేవను గాయనరతీలోని అమ్మ మనసును వెన్ను తట్టి లేపింది.

# 'తెర' వదల్లేరా ?



అనారోగ్యాలతో సంబంధం లేకుండా ఊరికే అలసిపోతున్నామంటున్నారు. రాత్రంతా నిద్రపోయినా ఇదే పరిస్థితి. ఎందుకిలా అంటే 'బ్రెయిన్ బర్నవుట్' అంటున్నారు నిపుణులు. చదువు, ప్రాజెక్టులు, వెంటనే ఉద్యోగా లంటూ పరుగు తీస్తున్న అమ్మాయిలే ఎక్కువ. ఈ క్రమంలో పదే పదే పలకరించే నోటిఫికేషన్లు, విరామం, పని ఏదైతేనేం తెరలకే ఎక్కువగా అతుక్కుపోవడం, ఒకే సమయంలో అనేక పనులు చేయడం, ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండాల్సి రావడం... ఇవన్నీ వెరసి మెదడును అలసిపోయేలా చేస్తున్నాయట. నోటిఫికేషన్లు, పని... వీటి మధ్య మాటిమాటికీ దృష్టి మరలుతూ ఉండటం వల్ల ఏకాగ్రత సన్నగిల్లుతోంది. దీర్ఘకాల ఒత్తిడి కూడా తోడై మెమరీపై ప్రభావం పడుతోంది. 'బ్రెయిన్ బర్నవుట్' బారినపడుతున్నారు. ఫలితమే చిన్న వయసులోనే మర్చిపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం, చిరాకు, దేన్నీ త్వరగా అర్థం చేసుకోలేక పోవడం వగైరాలన్నీ. ఇరవైల్లో ఇదెక్కువగా కనిపిస్తోందట. అదే సమస్య. తప్పించుకోవాలంటే విశ్రాంతిపై దృష్టి పెట్టాల్సిందేనట. కేవలం ఏడు గంటల నిద్రే సరిపోదు. పని మధ్యలో తప్పక చిన్న చిన్న విరామాలు తీసుకోవాలి. ఎప్పుడూ తెరకూ, నోటిఫికేషన్లకూ దూరంగా ఉండాలి. ఇంకా పుస్తకం చదవడం, నడక, బయట ఎక్కువసేపు గడపడం వంటి చిన్న చిన్న వ్యాపకాలకూ చోటివ్వాలి. సమస్య మరీ ఎక్కువగా కనిపిస్తే నిపుణులనూ కలవాలి. వయసు పెరిగేకొద్దీ మార్పులు సహజం. కానీ ఇరవైల్లోనూ కనిపిస్తోందంటే జాగ్రత్త తీసుకోవాల్సిందే.

# ఆరోగ్యం పట్ల ఆందోళన వద్దు!

వ్యథ



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న :** మాకు ఒక స్నేహితురాలు ఉంది. ఆమె ఆరోగ్య జాగ్రత్తల గురించి చాలా చెబుతుంది. 50 నుంచి 60 ఏళ్ల వయసున్న పది మంది ప్రతిరోజూ గురువు సమక్షంలో యోగా చేస్తుంటాము. అయితే ఆమె మా కళ్లను, ఒళ్లను, నడకను గమనించి ఏదో ఒక జబ్బు ఉందని ఊహించి చెబుతుంది. డాక్టర్లను కలిసి పరీక్షలు చేయించు కోవాలని సూచిస్తుంది. ఆమె బలవంతం చేయడంతో ఇటీవల నేను రూ.50 వేలు ఖర్చు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నాను. నాకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు చెప్పారు. ఈ విషయాన్ని ఆమెకు చెప్పగా, నా సలహా వల్ల మీకు ఎలాంటి సమస్యలు లేవని తెలిసింది కదా.. మంచిదే అంటూ తనను తాను సమర్థించుకుంది. ఆమె కూడా తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుం టుంది. ప్రతి ఒక్కరికీ ఇలాగే ఆరోగ్య జాగ్రత్తలు చెబుతుంది. ఇటీవల ఆమె భర్త సైకాల జిస్ట్ వద్దకు తీసుకెళ్లగా, ఆమెకు ఆరోగ్యం పట్ల భయం, అతిగా శ్రద్ధ ఉన్నట్లు గుర్తించారని, ఇతరుల్లో కూడా ఆందోళన కలిగించే అలవాటు ఉందని చెప్పి కాగ్ని టివ్ బిహేవియర్ థెరపీ ఇచ్చారట. ఆమె వల్ల నాకు రూ.50 వేలు ఖర్చ య్యాయి. ఇలాంటి వారిని ఎలా గుర్తించాలి?



– పద్మావతి, గుంటూరు

**జవాబు:** అమ్మా, మీ స్నేహితురాలిలో ఆరోగ్య జాగ్రత్త కంటే ఆరోగ్యం పట్ల అతిగా ఆందోళన చెందే స్వభావం ఉన్నట్లు అనిపిస్తుంది. కొంత మంది తమ ఆరోగ్యం గురించి ఎక్కువగా భయపడుతూ, శరీరంలో కనిపించే ప్రతి చిన్న మార్పును కూడా వ్యాధి లక్షణంగా భావిస్తుం టారు. అలాంటి వ్యక్తులు తమలోని ఆందోళనను ఇతరుల ఆరోగ్యం పైకి కూడా మళ్లించే అవకాశం ఉంటుంది. దీనిని సాధారణంగా 'ఆందోళన బదిలీ'గా చెప్పవచ్చు. ఇతరుల కళ్లను, నడకను, శరీరాకృతిని గమనించి వ్యాధులను ఊహించడం, వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఒత్తిడి చేయడం ఇందుకు కొన్ని సూచనలు.ముఖ్యంగా వైద్య అర్హత లేని వ్యక్తి 'మీకు ఈ వ్యాధి ఉండొచ్చు' వెంటనే అన్ని పరీక్షలు చేయించుకోండి" అంటూ పదేపదే భయపెడుతుంటే జాగ్రత్తగా ఉండాలి. ఒకసారి వైద్య పరీక్షల్లో ఎలాంటి సమస్య లేదని తేలినా, మళ్లీ మళ్లీ అనుమానాలు వ్యక్తం చేయడం కూడా ఆందోళనకు సంకేతం కావచ్చు. అయితే ఆరోగ్య సలహా చెప్పే ప్రతి వారినీ అనుమానించ కూడదు. ఇతరులు చెప్పారని మాత్రమే ఖరీదైన పరీక్షలు చేయించు కోవాల్సిన అవసరం లేదు. ముందుగా నిజంగా ఏదైనా లక్షణం ఉందా, వైద్యపరంగా పరీక్ష అవసరమా అనే విషయాన్ని వైద్యుడిని అడిగి నిర్ణయించుకోవాలి.అదే సమయంలో ఇటువంటి వ్యక్తులను ఎగతాళి చేయడం సరికాదు. వారికి తమ భయం నిజమైనదిగానే అనిపించవచ్చు. ఆరోగ్యంపై శ్రద్ధ మంచిదే. కానీ భయాన్ని ఆరోగ్య జాగ్రత్తగా మార్చి ఇతరులపై రుద్దడం మాత్రం మంచిది కాదు. మన ఆరోగ్య నిర్ణయాలు భయాల ఆధారంగా కాకుండా, వైద్యుల సలహా, శాస్త్రీయ ఆధారాల ఆధారంగా ఉండాలి.

# కాటన్ బాల్స్‌తో..



**కాటన్ బాల్స్..** ముఖానికి రోజ్ వాటర్ రాసుకోవడానికైనా, వేసుకున్న మేకప్ తొలగించు కోవడానికైనా, నెయిల్ పాలిష్‌ని తొలగించుకునే క్రమంలో.. ఇలా అతివల సౌందర్య సంరక్షణలో ఇవి చాలా రకాలు గానే ఉపయోగపడతాయని చెప్పచ్చు. ఇలా కేవలం బ్యూటీ విషయంలోనే కాదు.. ఈ కాటన్ బాల్స్‌ని ఇంట్లో మరిన్ని అవసరాల కోసం కూడా వాడచ్చంటున్నారు నిపుణులు.

**ఇంటి అవసరాల కోసం...**

ఇంట్లో చీమల బెడదను తగ్గించుకోవాలంటే కొన్ని వేడి నీళ్లలో కొద్దిగా చక్కెర వేసి.. అందులో టీస్పూన్ బోరాక్స్ పొడి వేసి కలపాలి. ఇందులో ముంచిన కాటన్ బాల్‌ని చీమలున్న చోట పెడితే అవి చచ్చిపోతాయి. కొన్ని చుక్కల వెనీలా ఎక్స్‌ట్రాక్ట్‌ని కాటన్ బాల్‌పై వేసి వార్డ్‌రోబ్‌లో ఓ మూల ఉంచితే దుస్తులు సవాసనలు వెదజల్లుతాయి. అలాగే రిఫ్రిజిరేటర్‌లో నుంచి వచ్చే దుర్వాసనలు పోగొట్టడానికీ ఈ చిట్కాను పాటించచ్చు. వంటింట్లో అప్పుడప్పుడూ దుర్వాసనలు రావడం మామూలే. ఇలాంటి సమయాల్లో కొన్ని కాటన్ బాల్స్‌ని ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్‌లో కాసేపు ఉంచి.. ఆ గిన్నెను ఓ మూలన ఉంచడం వల్ల ఫలితం ఉంటుంది. స్విచ్ బోర్డులు, డోర్ నాబ్స్, డోర్ స్టాపర్స్.. వంటి చిన్న చిన్న వస్తువుల్ని శానిటైజ్ చేయడా నికి పెద్ద, పెద్ద క్లాత్స్ కంటేచిన్న కాటన్ బాల్స్ ఉపయోగిస్తే సులభంగా పని పూర్తవుతుంది. ఎలుకలు, ఉడతలు, వంటివి గార్డెన్‌ను పాడుచేస్తుంటే.. వెనిగర్‌లో ముంచిన కొన్ని కాటన్ బాల్స్‌ని గార్డెన్ అక్కడక్కడా వేయండి. సమస్య ఇట్టే పరిష్కారమవుతుంది.

# ఎవరు ధర్మాత్ముడు ?

ఒకసారి 'గురవర్యా! ధర్మాత్ముడైన రాజు ఎవరో కాస్త తెలియజేయండి అంటే సూతమహర్షిని అడిగాడో ముని. అప్పుడు లోకంలో ఎందరు రాజులున్నా ధర్మాతుడైన రాజు మాత్రం జనమేజయుడు. రాజు అన్ని పనులూ చేయనవసరం లేదు. కర్తవ్యాలను నిర్వర్తిసే చాలు. దేశరక్షణ మొదటిది. తాను కానీ, తన పరివారం కానీ ప్రజల కష్టాలు తీర్చడం రెండోది. వీటిని సమర్థంగా పోషించా డాయన. సంవత్సరం పొడవునా యజ్ఞయాగాదులు నిర్వహించి లోక శ్రేయస్సు కలిగించేవాడు. ఆయనోసారి సత్రయాగం తలపెట్టినప్పుడు ఆవరణను పరిచారకులు శుభ్రం చేయసాగారు. అప్పుడు సరమ దేవత కొడుకు సారమేయుడు శునక రూపం ధరించి అక్కడి ఏర్పాట్లు చూస్తున్నాడు. కుక్క యజ్ఞ భూమిలో ఉండటం అపశకునం కనుక దాన్ని రాజు సోదరులు శ్రుత, భీమ, ఉగ్రసేనులు గాయపరిచి తరిమేశారు. సరమకు విషమం తెలిసి రాజు వద్దకు వచ్చి 'ఏ తప్పు చేయని నా బిడ్డ నీ తమ్ముళ్లు గాయపరిచారు కనుక నీకూ, నీ ప్రజలకూ, నీ సోదరులకూ పాపం కలుగుతుంది. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలు కలుగుతాయి' అని శపించి వెళ్లింది. రాజు ఆలోచించాడు. అంటే వ్యాధులూ, వరదలూ, భూకంపాలూ రావచ్చు. అలాంటి ప్రమాదాలు సంభవించకుండా ప్రకృతిని ప్రసన్నం చేసుకోవాలను కున్నాడు. సోమశ్రవుడు అనే పురోహితుడి సాయంతో వైపరీత్యాల నుంచి కాపాడుకున్నాడు. అందుకే మహాభారత కథ జనమేజయుడు, అతణ్ణి ధర్మమార్గన నడిపించిన శునకంతో ఆరంభమైంది. అదే కుక్క యమ ధర్మరాజు రూపంలో పాండవులను ధర్మమార్గన నడిపి భారతానికి సమాప్తం పలికింది. ఈ కారణంగానే భారతం ధర్మంతో, శునకంతో మొదలై అవే అంశాలతో పరిసమాప్తమయ్యింది. అందువల్ల శక్తి ఉంది కదాని బలహీనులను అవమానించకూడదు. అదే ఈ కథలో సందేశం అంటూ వివరించాడు సూతమహర్షి.

# బ్రెడ్ పకోడి



శనగపిండి: ఒక కప్పు, పచ్చిమిర్చి: ఆరు, జీలకర్ర: ఒక టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, అల్లంవెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, పసుపు, చాట్‌మసాలా, గరం మసాలా: పావు టీస్పూన్ చొప్పున, కొత్తిమీర, పుదీనా తరుగు: పావు కప్పు చొప్పున, వంటసోడా: చిటికెడు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

తయారీ : మిక్సీ జార్‌లో పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు వేసి కొద్దిగా నీళ్లుపోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఒక గిన్నెలో శనగపిండి, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, చాట్ మసాలా, గరం మసాలా, ఉప్పు, వంటసోడ వేసి.. కొద్దిగా నీళ్లుపోసి బజ్జీల పిండిలా జారుగా కలపాలి. బ్రెడ్ ముక్కలపై పుదీనా మిశ్రమం రాసి ఒకదానిపై ఒకటి పెట్టి అంచులు కట్ చేసి.. మూలగా రెండు ముక్కలు చేసి పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి, వేడయ్యాక బ్రెడ్ ముక్కలను శనగ పిండిలో ముంచి విడివిడిగా వేయిస్తే వేడివేడి బ్రెడ్ పకోడీ సిద్ధం.

# 'ది ట్రెయిటర్స్'కు హోస్ట్‌గా ఎంజాయ్ చేశాను :తేజ సజ్జ



భారతదేశంలో ప్రత్యేక ఒరిజినల్స్‌కు పేరుపొందిన ప్రముఖ స్ట్రీమింగ్ సర్వీస్ ప్రైమ్ వీడియో 'ది ట్రెయిటర్స్ తెలుగు' తో అలరించబోతోంది. విభిన్న రంగాలకు చెందిన 20 మంది సెలబ్రిటీలు ఈ గేమ్‌లో పాల్గొంటున్నారు. మొత్తం 10 ఎపిసోడ్లుగా రూపొందిన ఈ సిరీస్‌లో పోటీదారులు నమ్మకమే ప్రమాదంగా మారే ఒక ప్రపంచంలోకి అడుగుపెడతారు.

**వరుసగా సూపర్ హిట్ సినిమాలు చేస్తున్నారు కదా.. ది ట్రెయిటర్స్ కి హోస్ట్ గా మారడం ఎలా అనిపించింది?**
ట్రెయిటర్స్ గ్లోబల్‌గా చాలా పెద్ద హిట్ ఫ్రాంచైజ్. 20కి పైగా దేశాల్లో, 25కి పైగా భాషల్లో చేశారు. హిందీలో కరణ్ జోహార్ చేసినప్పుడు నాకు దాని గురించి పెద్దగా ఆలోచన లేదు. ఒక ఎపిసోడ్ చూడడం మొదలుపెట్టి రెండు రోజుల్లో మొత్తం సీజన్ పూర్తి చేశాను

**ఎన్ని రోజులు షూట్ చేశారు? హోస్ట్ క్యారెక్టర్ ఎలాంటి ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది?**
11 రోజులు షూట్ చేశాం. మొత్తం పది ఎపిసోడ్లు. నేను హిందీ వెర్షన్ చూస్తున్నప్పుడు అందులో నాకు పార్టిసిపెంట్స్‌తో ఎలాంటి ఎమోషనల్ కనెక్షన్ లేదు.వాళ్లు ఎవరో కూడా నాకు పరిచయం లేదు.

**గేమ్ షో ఎలా ఉండబోతుంది?** ఇందులో మొదటి మూడు ఎపిసోడ్లు వస్తాయి. ఆ మూడు ఎపిసోడ్లు చూసిన తర్వాత ఈ గేమ్ షోపై ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఇదంతా ఒక మర్డర్ మిస్టరీ లాగా ఉంటుంది. తెలుగులో ఇప్పటివరకు చూసిన ఏ రియాలిటీ షోతో దీనికి పోలిక ఉండదు. చాలా కొత్త ఫార్మాట్. నిజంగా ఒక రియల్ గేమ్‌లాగా ఉంటుంది.

**ఇది కొత్త గేమ్ షో అంటున్నారు కదా? ప్రేక్షకులకు ఈజీగా అర్థమవుతుందా?**మొదటి మూడు ఎపిసోడ్లు రిలీజ్ అవుతాయి. ఆ మూడు ఎపిసోడ్లు చూస్తే అసలు ఏం, ఎలాఉండ బోతుందో ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమానించాలి?ఎవరు ట్రెయిటర్స్? ఎవరు అమాయకులు? అనే కోణంలో నడిచే ఈ గేమ్ ఒక థ్రిల్లర్ లా వుంటుంది.

**ఇందులో కంటెస్టెంట్స్‌ను ఎలా సెలెక్ట్ చేశారు?**దీనికిగేమ్ ఆడే వాళ్లు చాలా ముఖ్యం. మానిపులేట్ చేయగలగాలి, నమ్మించగలగాలి, గేమ్స్‌లోని రూల్స్ తెలిసి ముందుకెళ్లగలగాలి. దాదాపు అన్ని రంగాల్లో ఉన్న వాళ్లని ఒక్కొక్కరుగా సెలెక్ట్ చేయడం జరిగింది. సెలబ్రిటీగా ఉండటం అనేది దీని ప్రియారిటీ కాదు.గేమ్ ఆడటం అనేది ప్రియారిటీ.

**కోటి రూపాయలు ప్రైజ్ మనీ అంటున్నారు కదా? ప్రైజ్ మనీ డిస్ట్రిబ్యూషన్ ఎలా ఉంటుంది?** అది మీరు గేమ్ షో చూసి తెలుసుకోవాలి.

తెర

# 'బా బా బ్లాక్ షీప్'కు మేఘాలయ సీఎం కాన్రాడ్ కె. సంగ్మా ప్రశంసలు

అక్టోబర్ 9న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కానున్న క్రైమ్ కామెడీ ఈ నేపథ్యంలో మేఘాలయ



ముఖ్యమంత్రి కాన్రాడ్ కె. సంగ్మా.. బా బా బ్లాక్ షీప్ చిత్ర యూనిట్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ వీడియో విడుదల చేశారు. 'ఇది మా రాష్ట్రానికి గర్వకారణమైన క్షణం' అని పేర్కొంటూ.. మేఘాలయలో పూర్తిగా చిత్రీకరించిన తొలి దక్షి ణ భారత చలన చిత్రం ఇదేనని, ఇది రాష్ట్ర అందాలను మన కొండలకు ఆవల ఉన్న ప్రేక్షకులకు చేరువ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పొగతో నిండిన మంచు కొండలు, అద్భుతమైన జలపాతాలు, స్వచ్ఛమైన నదులు, సజీవ వేర్ల వంతెనలను ఆయన ప్రస్తావిస్తూ."మన నేలను ప్రపంచంతో పంచుకునేందుకు సినిమా మరో చక్కని అవకాశం" అని చెప్పారు.నిర్మాత వేణు దోనేపూడికి, చిత్రాలయం స్టూడియోస్‌కు, నటీనటులకు, సాంకేతిక బృందానికి సంగ్మా అభినందనలు తెలిపారు. 'సినిమా చిత్రీకరణ కోసం మేఘాలయ రాష్ట్రాన్ని ఎంచుకున్నందుకు, నమ్మకం ఉంచినందుకు, దాని అందాలను వెండితెరపైకి తెచ్చినందుకు ధన్యవాదాలు" అన్నారు. మరింత మంది సినీ నిర్మాతలను రాష్ట్రానికి ఆహ్వానించేందుకు ఎదురు చూస్తున్నామని సంగ్మా పేర్కొన్నారు.

# 9న 'హనుమాన్ అంశ్' తెలుగులో విడుదల



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా, భక్తులు ప్రేమగా మహా రాజ్‌జీ అని పిలుచుకునే ఆయన జీవితం, బోధనల స్ఫూర్తితో రూపొం దిన హనుమాన్ అంశ్ చిత్రం..ఈ ఏడాది డివైన్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందు కున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకాదరణ ను సొంతం చేసుకుంది. విశ్వాసం, భక్తి, ఆధ్యాత్మిక పరివర్తన వంటి అంశాలు అన్ని తరాల ప్రేక్షకు లను ఆకట్టుకున్నాయి. డాక్టర్ విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వంలో హనుమాన్ అంశ్ తెరకెక్కింది. నీమ్ కరోలి బాబా పాత్రలో శోభినవ్ సత్య నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. హిందీ లో విజయవంతమైన థియేట్రికల్ జర్నీ అనంత రం ఇప్పుడు ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందు కు రాబోతోంది. . అక్టోబర్ 9న 'హనుమాన్ అంశ్' తెలుగు వెర్షన్ థియేటర్లలో విడుదల కానుంది. ప్రెస్ మీట్ లో హీరో శోబినవ్ సత్య మాట్లాడుతూ.. జై సీతారాం. విశాల్ మన భారతీయ సంస్కృతికి చాలా కీలకమైన, ముఖ్య మైన సినిమాని తీశారు. ఆయన వల్లే ఈ సినిమా ఎక్కడ వరకు చేరింది. డైరెక్టర్ విశాల్ మాట్లాడుతూ.. జై సీతారాం. హైదరాబాద్ రావడం చాలా ఆనందంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు సినిమాని తెలుగులో విడుదల చేయాలని కోరుకున్నారు. ఇందులో హోంబలే ఫిలిమ్స్ భాగస్వామి అయినందుకు చాలా ఆనందంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా సరే భారీ భారీ హనుమంతుల వారి విగ్రహాలు కనిపిస్తాయి. మనందరం కూడా బజరంగ్‌బలి భక్తులమే. ప్రొడ్యూసర్ రాగిణి మాట్లాడుతూ.. హోంబలే ఫిల్మ్స్‌కి థాంక్యూ. ఇది నార్త్ ఇండియాలో ఎంత గొప్ప విజయాన్ని సాధించిందో, ఇక్కడ కూడా అదే గొప్ప విజ యాన్ని సాధిస్తుందని నమ్మకం ఉంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. ఈ సినిమా హిందీలో ఎంత పెద్ద సంచలనం సృష్టించిందో మనందరికీ తెలుసు. ఇందులో కథానాయకుడిగా చేసిన సత్య అద్భుతంగా నటించారు. మైత్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సినిమాని హిందీలో చూసిన ప్రేక్షకులు తెలుగులో ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూశారు.

# 'సమ్మర్ హాలిడేస్' 'ఫ్రెండ్షిప్ సాంగ్' రిలీజ్



కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తు న్నారు. 'సమ్మర్ హాలిడేస్' సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'సమ్మర్ హాలిడేస్' సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ సక్సెస్ ఫుల్ గా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన 'క్రష్ సాంగ్..' 'స్కూల్ సాంగ్' మ్యూజిక్ లవర్స్ నుంచి హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఈ రోజు ఈ సినిమా నుంచి 'ఫ్రెండ్షిప్ సాంగ్..' రిలీజ్ చేశారు. ఈ పాటను సింజిత్ యెర్రమల్లి బ్యూటిఫుల్ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. ఈ పాట పల్లవికి పూర్ణాచారి సాహిత్యం అందిం చగా, చరణం, హుక్ లైన్ కిట్టు విస్సాప్రగడ రాశారు. శ్రీ రామ చంద్ర ఆకట్టుకునేలా పాడారు. 'ఫ్రెండ్షిప్ సాంగ్..' ఎలా ఉందో చూస్తే 'ఓ రెండు తోకచుక్కలు తొడిగాయి చిన్ని రెక్కలు, గోదారి దారిపొడవునా ఎగిరాయే, ఆ పాల బోసినవ్వులు, అల్లరి తారా జువ్వలు, ఊరంతా కొత్త సందడే చేశారే, యేటి గట్టులో, మావి చెట్టులో, నీటి తొట్టిలో వీరే, ఒక్క చోటులో కుదురుగుండరు, రోజంతా ఈ కోతిలే, కాగితాల పడవల్లా తేలుతూ దాటుతారు గోదారే...' అంటూ సాగుతుందీ పాట. ఈ పాటలో మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి, సింగర్ శ్రీరామచంద్ర నటించడం విశేషం.

# 'సరిపోయారు ఇద్దరూ' టీజర్ విడుదల



హ్యాపీ ఆక్స్ ఎంటర్టైన్మెంట్, ఎంఎస్ వారాహి క్రియేషన్స్, శతమానంభవతి ఆర్ట్స్ బ్యానర్ల మీద సాదత్, ముని శివ నిర్మించిన చిత్రం 'సరిపోయారు ఇద్దరూ' సతీష్ వేగేశ్న తెరకెక్కించిన ఈ మూవీలో మేఘాంశ్ శ్రీహరి, యశ్విన్ వేగేశ్న, రాజేంద ప్రసాద్, సీనియర్ నటుడు నరేష్, రిద్ధి కుమార్, మేఘా చౌదరి కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీ టీజర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. హిట్ మెషీన్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేసి టీం కు అభినందనలు తెలిపారు.టీజర్‌లో పల్లెటూరి వాతావరణం, వైజాగ్ సిటీని అందంగా చూపించారు. టీజర్ ప్రారంభంలో స్నేహితులుగా కలిసి ఉన్న నరేష్, రాజేంద్ర ప్రసాద్.. టీజర్ ఎండింగ్‌కి అలా ఎందుకు మారారు? అన్నదే కథ అన్నట్టు కట్ చేశారు. ఇక యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి ఎక్కువగా కనెక్ట్ అయ్యేలా సినిమాని సతీష్ వేగేశ్న తెరకెక్కించారు. టీజర్‌లో మేఘాంశ్ శ్రీహరి, యశ్విన్ వేగేశ్న స్క్రీన్ ప్రజెన్స్ బాగున్నాయి. హీరో, హీరోయిన్ల లవ్ ట్రాక్.. వైజాగ్ ఎపిసోడ్స్ సినిమాకి కీలకంగా ఉండబోతోన్నాయి. ఈ మూవీకి అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. సమీర్ రెడ్డి సినిటోగ్రఫీ సినిమాకి ప్రధాన ఆకర్షణ కానున్నాయి. ఈ చిత్రాన్ని త్వరలోనే ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# 'మయూఖ' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది :శ్రీ తేజ్ ఎస్.కె



పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "మయూఖ".ఈ చిత్రాన్ని శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహిస్తున్నారు, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మిస్తున్నారు. సినిమా బండి ప్రొడక్షన్స్ బ్యానర్ పై పలు ఇంట్రెస్టింగ్ మూవీస్ నిర్మించిన శ్రీకాంత్ కాండ్రేగుల శ్రీతేజ్ ఎస్.కె. గా స్క్రీన్ నేమ్ మార్చుకుని ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. "మయూఖ" సినిమా ఈ నెల 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. మా మయూఖ సినిమాకు ఇటీవల న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ మిస్టరీ మూవీగా అవార్డ్ వచ్చింది. థ్రిల్లర్ కేటగిరిలో సెకండ్ బెస్ట్ వచ్చింది. ఈ అవార్డ్ వస్తుందని మేము ఎక్స్ పెక్ట్ చేయలేదు. మా మూవీ అవార్డ్ కు సెలెక్ట్ అయ్యిందని తెలిసి టీమ్ అంతా హ్యాపీగా ఫీలయ్యాం. మేము కేన్స్ ఫిలిం ఫెస్టివల్ కు కూడా మా మూవీని అప్లై చేశాం. మీరు మా మూవీ ప్రమోషనల్ కంటెంట్ చూస్తే కొరియన్, హాలీవుడ్ మూవీ తరహా స్టోరీ టెల్లింగ్, కలర్ గ్రేడింగ్ కనిపిస్తుంటుంది. ఈ కథను మొదట నటి మహేశ్వరి (గులాబీ ఫేమ్) కి చెప్పాం. ఆమె మేము చెప్పిన రెండు కథలు విన్నారు. ఈ స్టోరీతో పాటు మరొక కథ ఆమెకు బాగా నచ్చింది. ఆ కథకు ఆమె లాక్ అయ్యారు. పాయల్ కన్నడలో మంచి ఎంటర్ టైనింగ్ మూవీస్ చేశారు. ఆమె మా కథలోని క్యారెక్టర్ కు బాగా సరిపోతా రని అనిపించింది. ఆమె చేసిన వెబ్ సిరీస్ లతో ఇప్పటికే తెలుగు ఆడియెన్స్ కు రీచ్ అయ్యారు. ఇలాంటి తరహా థ్రిల్లర్స్ గతంలో వచ్చినా మా మూవీలో స్క్రీన్ ప్లే, సినిమా స్టోరీని ప్రెజెంట్ చేసే విధానం కొత్తగా ఉండి ఆకట్టుకుంటుంది. ప్రెజెంటేషన్ కొత్తగా ఉంది కాబట్టే న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ థ్రిల్లర్ గా అవార్డ్ దక్కింది. ఇక్కడే మా ప్రయత్నం సక్సెస్ అయ్యిందనే నమ్మకం మొదలైంది. ఎక్కడో స్మశానంలో దెయ్యాలు ఉన్నాయంటే ముందే మనసు ప్రిపేర్ అవుతుంది కానీ మనం నివసించే చోట, రోజు ఉండే చోట ఎవరో అపరిచిత వ్యక్తి ఉన్నారంటే ఇంకా ఎక్కువ భయపడతాం. మయూఖ హారర్ సినిమా కాదు థ్రిల్లర్ మూవీ.

8-10pg10exH.qxd:8-10pg10exH.qxd 1/1/02 6:01 AM Page 1



## న్యూజిలాండ్‌తో టి20: టీమిండియాలో
# ముగ్గురు కీలక ఆటగాళ్లు గల్లంతు



**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌ కోసం భారత్‌ 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌లో శ్రేయస్‌ అయ్యర్‌ కెప్టెన్‌గా, తిలక్‌ వర్మ వైస్‌ కెప్టెన్సీగా కొనసాగనున్నారు. ఈ టీ20 ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ ఈ నెల 22న క్రైస్ట్‌చర్చ్‌లో ప్రారంభమై నవంబర్‌ 1 వరకు జరుగుతుంది. దాదాపు నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్‌ కుమార్‌, రీ ఎంట్రీ ఇవ్వగా, వరుణ్‌ చక్రవర్తికి స్థానం లభించింది. ప్రస్తుత జట్టులో అయ్యర్‌తో పాటు, అభిషేక్‌ శర్మ, సంజు సామ్సన్‌, ఇషాన్‌ కిషన్‌, తిలక్‌ వర్మ, వైభవ్‌ సూర్యవంశీ, శివమ్‌ దూబే ఉన్నారు. అయితే జట్టులో రింకు సింగ్‌, వాషింగ్టన్‌ సుందర్‌, కృనాల్‌ పాండ్యాలకు చోటు దక్కలేదు. రింకు అత్యంత గుర్తింపు పొందిన టీ20 ఫినిషర్లలో ఒకడిగా కొనసాగుతున్నప్పటికీ, ఈ బ్యాటర్‌ మరోసారి జట్టుకు దూరమయ్యాడు. అతను ఐపీఎల్‌ 2026లో అద్భుతంగా రాణించి, 14 మ్యాచ్‌లలో రెండు అర్ధశతకాలతో సహా 148.99 స్ట్రైక్‌ రేట్‌తో 295 పరుగులు చేశాడు. జింబాబ్వేతో జరిగిన భారత టీ20 సిరీస్‌లో కూడా అతను తనదైన ముద్ర వేసి, రెండు ఇన్నింగ్స్‌లలో 168.18 స్ట్రైక్‌ రేట్‌తో 37 పరుగులు చేశాడు. అతని ఫామ్‌ లేకపోవడం కంటే, భారత బ్యాటింగ్‌ ఎంపికలు అధికంగా ఉండటమే అతడిని జట్టులోకి తీసుకోకపోవడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. వాషింగ్టన్‌ సుందర్‌ గైర్హాజరు విషయం కాస్త భిన్నమైనది. ఈ ఆల్‌రౌండర్‌ను వాస్తవానికి వెస్టిండీస్‌ టీ20ల కోసం ఎంపిక చేసినప్పటికీ, రెడ్‌బాల్‌ క్రికెట్‌పై దృష్టి సారించి, న్యూజిలాండ్‌తో జరగబోయే టెస్ట్‌ సిరీస్‌కు సిద్ధమయ్యేందుకు అతడిని జట్టు నుండి తొలగించారు. న్యూజిలాండ్‌ పర్యటన కోసం ఇండియా ఎ జట్టులో భాగంగా ఉన్నాడు. సుందర్‌ మల్టీఫార్మాట్‌ ఆటగాడిగా 65 టీ20 లు ఆడి, 286 పరుగులు, 52 వికెట్లు సాధించాడు. పొదుపైన ఆఫ్‌స్పిన్‌ బౌలింగ్‌ చేయగల అతని సామర్థ్యం, బ్యాట్‌తో రాణించడం అతన్ని ఒక విలువైన ఎంపికగా మార్చాయి, కానీ సెలెక్టర్లు ప్రధాన టీ20 జట్టులో అక్షర్‌ పటేల్‌, శివమ్‌ దూబే, నితీష్‌ కుమార్‌లను ఎంచుకున్నారు.

# ఉరుగ్వే చేతిలో భారత్‌ చిత్తు
## 1-6 తేడాతో ఓటమి




**కోల్‌కతా:** అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో రెండుసార్లు మాజీ ప్రపంచ ఛాంపియన్‌ అయిన ఉరుగ్వే 6-1 తేడాతో సునాయాసంగా భారత్‌పై గెలుపు సాధించింది. అనిరుధ్‌ థాపా గోల్‌ చేసినప్పటికీ ఉరుగ్వే భారత్‌ను చిత్తుగా ఓడించింది. తొలి అర్ధభాగంలో భారత్‌ ఎంతో ఆశాజనకంగా ఆడింది. 11వ నిమిషంలో డార్విన్‌ నునెజ్‌ పెనాల్టీ ద్వారా సాధించిన గోల్‌ను, 22వ నిమిషంలో థాపా చేసిన గోల్‌ సమం చేయడంతో, 20వ ర్యాంకులో ఉన్న దక్షిణాది జట్టుపై ఆతిథ్య జట్టుకు నమ్మకం కలిగింది. కానీ మెరుపుల కారణంగా 34 నిమిషాల పాటు ఆట నిలిచిపోయిన తర్వాత క్రమంగా వెనుకబడిపోవడంతో, ఉరుగ్వే ఆటపై పట్టు సాధించి, మాక్సిమిలియానో అరౌజో (28వ, 59వ నిమిషాలు), రోడ్రిగో జలజార్‌ (53వ నిమిషం), ప్రత్యామ్నాయ ఆటగాళ్లు జువాన్‌ సనబ్రియా (71వ నిమిషం), రోడ్రిగో అగ్యురేల ద్వారా మరో ఐదు గోల్స్‌ చేసింది. ఖాలిద్‌ జమీల్‌ జట్టు పనామాతో 1-1 డ్రాతో అంతర్జాతీయ విండోను ముగించి, ఆ తర్వాత మూడు రోజుల వ్యవధిలో బ్రెజిల్‌ మరియు ఉరుగ్వేల చేతిలో వరుసగా 0-4 మరియు 1-5 తేడాతో ఓటమి చవిచూసింది. ఉరుగ్వే చేతిలో భారత్‌ 16 తేడాతో ఓడిపోయింది. విలియమ్స్‌ మిడ్‌ఫీల్డ్‌లో షాట్‌ కొట్టగా, కార్డోజో దానిని అడ్డుకున్నా థాపా అత్యంత వేగంగా స్పందించి గోల్‌ చేశాడు. అరౌజో గోల్‌ చేసి ఉరుగ్వేను ఆధిక్యంలోకి తీసుకువచ్చాడు. ఆ తర్వాత ప్రత్యామ్నాయ ఆటగాడు సనబ్రియా గోల్‌ కొట్టగా ఉరుగ్వే విజయం సాధించింది.

### ఆర్కిటిక్‌ ఓపెన్‌లో మెయిన్‌ డ్రాకు
# సింధు, తరుణ్‌, రౌనక్‌
### ఉన్నతి, అష్మిత ఓటమితో నిష్క్రమణ

**ఫిన్లాండ్‌:** రెండుసార్లు ఒలింపిక్‌ పతక విజేత పివి సింధు మహిళల సింగిల్స్‌ రెండో రౌండ్‌కు చేరుకోగా, ఆర్కిటిక్‌ ఓపెన్‌ సూపర్‌ 500 టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తరుణ్‌ మన్నేపల్లి, రౌనక్‌ చౌహాన్‌ పురుషుల సింగిల్స్‌ విజయాలతో మెయిన్‌ డ్రాకు దూసుకెళ్లారు. ఆసియా క్రీడల్లో క్వార్టర్‌ ఫైనల్స్‌లో ఓడిపోయి పతకం కోల్పోయిన మాజీ ప్రపంచ ఛాంపియన్‌ సింధు, కెనడాకు చెందిన వెన్‌ యు జాంగ్‌ను 28 నిమిషాల్లో 21-8, 21-11 తేడాతో ఓడించింది. ఉన్నతి హూడా, చైనాకు చెందిన హాన్‌ కియాన్‌ క్సీ చేతిలో 16-21, 21-15, 22-24 తేడాతో ఓడిపోగా, అష్మిత చలిహా డెన్మార్క్‌కు చెందిన ఏడవ సీడ్‌ లైన్‌ క్రిస్టోఫర్సెన్‌ చేతిలో 7-21, 21-14, 24-26 తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు, మాల్విక బన్సోద్‌ తైవాన్‌కు చెందిన సంగ్‌ షువో యున్‌ను 21-15, 14-21, 21-14 తేడాతో ఓడించి మెయిన్‌ డ్రాలోకి ప్రవేశించింది, కానీ రౌండ్‌ ఆఫ్‌ 32లో అనుభవజ్ఞురాలైన స్కాటిష్‌ క్రీడాకారిణి కిర్స్టీ గిల్మోర్‌ను అధిగమించలేక, 40 నిమిషాల పోరులో 18-21, 13-21 తేడాతో ఓడిపోయింది. క్వాలిఫికేషన్‌ రౌండ్‌లో, మన్నేపల్లి బెల్జియంకు చెందిన రెండో సీడ్‌ జూలియన్‌ కారగ్గిని 21-12, 19-21, 21-13 తేడాతో ఓడించాడు. చౌహాన్‌ ఇజ్రాయెల్‌కు చెందిన డానియిల్‌ దుబోవెంకోను 18-21, 21-17, 21-19 స్కోరుతో ఓడించాడు. అయితే, రక్షిత, శ్రీ సంతోష్‌ రామ్‌రాజ్‌ జర్మనీకి చెందిన యవోన్‌ లీ చేతిలో 11-21, 21-16, 9-21 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్‌ నుండి నిష్క్రమించింది.






# తొలి వన్డేలో ఇండియా ఘోర పరాజయం
## ఆస్ట్రేలియా చేతిలో 125 రన్స్‌తో ఓటమి



**పుదుచ్చేరి:** మొదటి అనధికారిక వన్డేలో ఇండియా ఎ జట్టుకు కోలుకోలేని షాక్‌ తగిలింది. ఆస్ట్రేలియా ఎ చేతిలో ఏకంగా 125 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత యువ జట్టు, ఆసీస్‌ బౌలర్ల ధాటికి తాళలేక కేవలం 149 పరుగులకే కుప్పకూలిపోయింది. మొదటి ఇన్నింగ్స్‌ తర్వాత విజయం మనదే అనుకున్న అభిమానులకు ఛేజింగ్‌లో భారత బ్యాటర్లు తీవ్ర నిరాశ మిగిల్చారు. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న ఆస్ట్రేలియాకి ప్రారంభంలోనే గట్టి షాక్‌లు తగిలాయి. భారత బౌలర్‌ సూర్యాంశ్‌ షెడ్గే ధాటికి కేవలం 87 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. ఆ సమయంలో ఆసీస్‌ కనీసం 150 పరుగులు కూడా చేయదేమో అనిపించింది. కానీ నాలుగో స్థానంలో వచ్చిన నాథన్‌ మెక్‌స్వీనీ అద్భుత సెంచరీ (135 బంతుల్లో 123 పరుగులు, 13 ఫోర్లు)తో జట్టును ఆదుకున్నాడు. కెప్టెన్‌ విల్‌ సుదర్‌లాండ్‌తో కలిసి నాథన్‌ మెక్‌స్వీనీ ఆరో వికెట్‌కు ఏకంగా 141 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. సుదర్‌లాండ్‌ కూడా 2 ఫోర్లు, 4 సిక్సర్లతో విరుచుకుపడి 77 పరుగులు సాధించాడు. దీంతో ఆస్ట్రేలియా 48.2 ఓవర్లలో 274 పరుగుల గౌరవప్రదమైన స్కోరుకు చేరుకుని ఆల్‌రౌండ్‌ ప్రదర్శన చేసింది. భారత్‌ బౌలర్లలో సూర్యాంశ్‌ షెడ్గే 4 వికెట్లతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. 275 పరుగుల ఛేజింగ్‌ ప్రారంభించిన ఇండియా ఆదిలోనే తడబడింది. స్కోరు బోర్డుపై కేవలం 12 పరుగులు ఉన్నప్పుడే తొలి వికెట్‌ కోల్పోగా, 58 రన్స్‌ అయ్యేసరికి ఏకంగా 4 వికెట్లు నేలకూలాయి. రజత్‌ పటీదార్‌ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్సర్‌) కాస్త పోరాడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేసినా, అతనికి సహకరించే బ్యాటర్‌ కరువయ్యాడు. 105 పరుగుల వద్ద ఐదో వికెట్‌ పడిన తర్వాత భారత ఇన్నింగ్స్‌ పడిపోయింది. 118 పరుగులకు ఆరో వికెట్‌, 138 పరుగులకు ఏడో వికెట్‌ కోల్పోగా, చివరికి 149 పరుగుల వద్దే మిగిలిన 3 వికెట్లు వరుసగా పడిపోయాయి. దీంతో 31.4 ఓవర్లలోనే భారత్‌ కథ ముగిసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో మహ్లీ బియర్డ్‌మాన్‌ 4 వికెట్లు తీసి భారత బ్యాటింగ్‌ వెన్ను విరిచాడు.

# యూత్‌ టెస్ట్‌లో భారత్‌ ఘన విజయం
## 2-0తో ఆస్ట్రేలియాపై సిరీస్‌ క్లీన్‌ స్వీప్‌




**అహ్మదాబాద్‌:** యూత్‌ టెస్టులో భారత్‌ అండర్‌19 జట్టు ఆస్ట్రేలియా అండర్‌19 జట్టుపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆతిథ్య జట్టు సందర్శక జట్టును 151 పరుగులకే ఆలౌట్‌ చేయగా, బలోడా 8/41తో తన మ్యాచ్‌ గణాంకాలను 14/73కి చేర్చుకున్నాడు. కేవలం 11 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్ష్య రైచందాని, ఛేజింగ్‌లోని మొదటి రెండు బంతులను బౌండరీకి తరలించడంతో ఇండియా మొదటి ఓవర్‌లోనే మ్యాచ్‌ను ముగించింది. బ్లేక్‌ క్యాటిల్‌, జెడ్‌ హోలిక్‌ ఓవర్‌నైట్‌ బ్యాటర్లుగా ఉండగా, ఆస్ట్రేలియా 55 పరుగుల వెనుకబడి, నాలుగు వికెట్ల నష్టానికి 86 పరుగులతో రోజును ప్రారంభించింది. రెండో రోజు చివరి సెషన్‌లో పిచ్‌ బాగా దెబ్బతిన్నట్లు కనిపించడంతో, బలోడా మూడో రోజు తన మొదటి బంతికే డిఫెండింగ్‌లో ఉన్న హోలిక్‌ను ఎల్బీడబ్ల్యూగా అవుట్‌ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లో చార్లీ హెండర్సన్‌ ఆఫ్‌, మిడిల్‌ స్టంప్స్‌ను పడగొట్టి క్లీన్‌ బౌల్డ్‌ చేశాడు. క్యాటిల్‌ అపారమైన పరిణితిని ప్రదర్శించి, మరో ఎండ్‌లో ఉన్న 10వ నంబర్‌ బ్యాట్స్‌మెన్‌ పాట్రిక్‌ సుల్లివన్‌తో కలిసి స్ట్రైక్‌ను తన ఆధీనంలో ఉంచుకున్నాడు. కెప్టెన్‌ యశ్‌బర్దన్‌ చౌహాన్‌, క్యాటిల్‌ ఫీల్డ్‌ను ఓపెన్‌గా ఉంచి, అతడిని సింగిల్స్‌ తీసుకునేలా ఒత్తిడి చేశాడు. క్యాటిల్‌ బంతిని లాంగ్‌ఆఫ్‌ మీదుగా పంపి తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత అతను ఆస్ట్రేలియాను భారత్‌ ఆధిక్యాన్ని అధిగమించేలా చేశాడు. బలోడాను ఎదుర్కొనే ప్రయత్నంలో క్యాటిల్‌ చివరికి బౌల్డ్‌ అయ్యాడు. దీంతో భారత్‌ ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్‌ స్వీప్‌ చేసింది.

# రూ.4.31 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
## రెపోరేట్‌ ఎఫెక్ట్‌తో నష్టాల్లో సెన్సెక్స్‌, నిఫ్టీ



**ముంబయి, అక్టోబరు 7:** భారత స్టాక్‌ మార్కెట్‌ బుధవారం భారీగా నష్టపోయింది. బిఎస్‌ఇ సెన్సెక్స్‌ 429 పాయింట్లు నష్టపోగా, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 173 పాయింట్లు నష్టపోయింది. రెపో రేట్‌ పెంచుతూ ఆర్బీఐ తీసుకున్న నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. రెపో రేటును ఆర్బీఐ 25 బేసిస్‌ పాయింట్లు (0.25 శాతం) పెంచడంతో రెపో రేటు మొత్తం 5.50 శాతానికి పెరిగింది. మూడున్నరేళ్ల తర్వాత రెపో రేటును ఆర్బీఐ పెంచింది. ఈ నిర్ణయం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. దీంతో స్టాక్‌ మార్కెట్‌ నష్టాల్లో కొనసాగింది. సెన్సెక్స్‌ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 173.05 పాయింట్లు నష్టపోయి 22,603.05 వద్ద ముగిసింది. బ్రాడర్‌ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌ సెలెక్ట్‌ ఇండెక్స్‌ 76.43 పాయింట్లు నష్టపోగా, బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్‌ సెలెక్ట్‌ ఇండెక్స్‌ 15.71 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్‌క్యాప్‌ సూచీ 0.5 శాతం నష్టపోగా, స్మాల్‌క్యాప్‌ సూచీ 0.4 శాతం వృద్ధితో ముగిసింది. ఈ భారీ పతనం కారణంగా పెట్టుబడిదారుల సంపదగా భావించే బిఎస్‌ఇ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ రూ. 474.75 లక్షల కోట్ల నుండి రూ. 470.44 లక్షల కోట్లకు పడిపోయింది. సుమారుగా 4.30 లక్షలకోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నిఫ్టీ మెటల్‌ షేర్లు 2.33 శాతం పడిపోగా, నిఫ్టీ ఆటో 1.58 శాతం నష్టపోయింది. నిఫ్టీ పిఎస్‌యూ బ్యాంక్‌ మాత్రం ఒక శాతం లాభపడింది. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ స్వల్పంగా బలహీనపడింది. బిఎస్‌ఈ సెన్సెక్స్‌ 30 ఇండెక్స్‌లో కోటక్‌ బ్యాంక్‌, బజాజ్‌ ఫైనాన్స్‌, ఐసిఐసిఐ బ్యాంక్‌, భారతీ ఎయిర్‌టెల్‌ షేర్లు లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా కోటక్‌ బ్యాంక్‌ షేర్లు 2.21 శాతం లాభపడ్డాయి. మరోవైపు ఏసియన్‌ పెయింట్స్‌, ఎల్‌ అండ్‌ టీ, ఇన్ఫోసిస్‌, బిఇఎల్‌, టైటాన్‌ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అత్యధికంగా నష్టపోయింది టైటాన్‌ (3.52 శాతం). డాలర్‌తో 45 పైసలు పడిపోయిన రూపాయి 96.77 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్‌ ధర స్వల్పంగా పెరిగింది. 0.98 శాతం పెరిగిన బ్యారెల్‌ క్రూడాయిల్‌ ధర 101.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్‌ ఎఫెక్ట్‌ నిల్‌
## గవర్నర్‌ సంజయ్‌ మల్హోత్రా

**ముంబయి, అక్టోబరు 7:** యుపిఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్‌ డిస్కౌంట్‌ రేట్‌ (ఎండీఆర్‌) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్‌ బ్యాంక్‌ గవర్నర్‌ సంజయ్‌ మల్హోత్రా అన్నారు. ఈనెల 15నుంచి రూ. 2 వేలు దాటిన యుపిఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్‌ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యుపిఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, "ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యుపిఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు. గత ఆరేళ్లుగా నిర్దిష్ట యుపిఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2వేలకు పైబడిన లావాదేవీలపై ఎండిఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ గతంలోనే స్పష్టం చేశారు. ఈ ఛార్జీలకు సంబంధించి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఉత్పత్తులవంటి రంగాల్లో రూ. 2వేలు దాటిన చెల్లింపులపై ప్రతి లావాదేవీకి రూ. 5 ఫ్లాట్‌ ఫీజు ఉంటుంది. రూ. 75వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో జరిగే లావాదేవీలపై ఎండిఆర్‌ గరిష్ఠంగా రూ. 300గా నిర్ణయించారు. వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ లావాదేవీలపై ఎంత మొత్తమైనప్పటికీ ఎలాంటి ఛార్జీలు ఉండవని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# రెపోరేట్‌ 25 బేసిస్‌ పాయింట్లు పెంచిన ఆర్బీఐ




**ముంబయి, అక్టోబరు 7:** ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపోరేటును 25 బేసిస్‌ పాయింట్లు పెంచింది. దాంతో రెపోరేటు 5.50 శాతానికి చేరింది. ఫ్లోటింగ్‌ ఇంట్రెస్ట్‌ రేటుకు హౌసింగ్‌, వెహికల్‌ లేదా ఇతర స్థిరాస్తి లోన్‌ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఆర్‌బీఐ గవర్నర్‌ సంజయ్‌ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజులపాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమీక్షా సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతోపాటు స్టాండింగ్‌ డిపాజిట్‌ ఫెసిలిటీ రేటును 5.25 శాతానికి, మార్జినల్‌ స్టాండింగ్‌ ఫెసిలిటీ, బ్యాంక్‌ రేటును 5.75 శాతానికి పెంచారు. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దాంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జూలైలో ఇది 4.45 శాతంగా ఉంది. అదేవిధంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్‌ రాబడులు పెరగడం, క్రూడ్‌ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపోరేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపోరేటు పెరగవచ్చని నిపుణులు ముందుగానే అంచనావేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండవచ్చని ఎస్‌బిఐ రిసెర్చ్‌ పేర్కొన్నది. ఫ్లోటింగ్‌ ఇంట్రెస్ట్‌ రేటుకు హౌసింగ్‌, వెహికల్‌ లేదా ఇతర స్థిరాస్తి లోన్‌ తీసుకున్నవారిపై వడ్డీ భారం పడనుంది. ఈ వడ్డీ భారాన్ని ఆయా బ్యాంకులు రెండు రకాలుగా వినియోగదారునిపై వేయనున్నాయి. నేరుగా ఇఎంఐపైన వేస్తే మీరు చెల్లించే నెలవారి ఇఎంఐ పెరుగుతుంది. అలాకాకుండా లోన్‌ కాల వ్యవధి పైన కూడా వేయవచ్చు. ఇఎంఐలో తేడా రాకుండా మొత్తంలోన్‌ చెల్లించే కాల వ్యవధి పెరుగుతుంది. బ్యాంకును సంప్రదించి ఈ రెండింటిలో ఏది మీకు వర్తించింది అనేది తెలుసుకోవచ్చు. ఇఎంఐ పెంచుకోవడం మంచిదా లేక లోన్‌ కాలవ్యవధి పెంచుకుంటే మంచిదా అనేది ఆర్థిక నిపుణులను అడిగి తెలుసుకోవాలి.

## ఎగుమతిదారులకు రుణ గడువు 450 రోజులకు పెంచాలి: ఎఫ్‌ఐఇఒ



**న్యూఢిల్లీ, అక్టోబరు 7:** ప్రీ షిప్మెంట్‌, పోస్ట్‌షిప్మెంట్‌ ఎగుమతి రుణాల కాల పరిమితిని ప్రస్తుత 270 రోజుల నుంచి 450 రోజులకు పెంచాలని ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ ఎక్స్‌పోర్ట్‌ ఆర్గనైజేషన్స్‌ రిజర్వ్‌ బ్యాంక్‌ను కోరింది. ఆర్బీఐ పాలసీ రెపో రేటును 25 బేసిస్‌ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చడంతో పాటు, ద్రవ్య విధాన వైఖరిని 'క్యాలిబ్రేటెడ్‌ టైటనింగ్‌'గా మార్చిన నేపథ్యంలో ఎఫ్‌ఐఇవో ఈ విజ్ఞప్తి చేసింది. రుణ వ్యయాలు పెరగడం వల్ల ఎగుమతిదారులపై, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఇలపై ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం ఉందని సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యం అనేక అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో అధిక వడ్డీ వ్యయాలు ఎగుమతి రంగంపై ప్రభావం చూపవచ్చని పేర్కొంది. ఎఫ్‌ఐఇఒ అధ్యక్షుడు ఎస్‌.సి. రల్హాన్‌ మాట్లాడుతూ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్‌ పాయింట్లు పెంచడం అర్థవంతమేనని అన్నారు. అయితే ఎగుమతులపై ఆధారపడిన వ్యాపారాలకు, ముఖ్యంగా ఎస్‌ఎంఇలకు అవసరమైన వర్కింగ్‌ క్యాపిటల్‌ అందుబాటును ద్రవ్య విధానం ప్రభావితం చేయకుండా చూడటం కీలకమని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ జిడిపి వృద్ధి 7.8 శాతంగా నమోదైందని, వస్తువులు మరియు సేవల ఎగుమతులు కూడా బలమైన వృద్ధి ధోరణిని కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వడ్డీ వ్యయాలు పెరగడం ఎగుమతిదారుల ఆర్థిక స్థితిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని రల్హాన్‌ అన్నారు. ఎక్కువ కాలం పడుతున్న షిప్పింగ్‌, రవాణా ప్రక్రియలు, లాజిస్టిక్స్‌ అంతరాయాలు, ఎగుమతి బకాయిల వసూళ్లలో జాప్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రీషిప్మెంట్‌, పోస్ట్‌షిప్మెంట్‌ ఎగుమతి రుణాల కాలాన్ని 270 రోజుల నుంచి 450 రోజులకు పెంచాలని ఆయన ఆర్బీఐని కోరారు.

# రూపాయికి షాకిచ్చిన ఆర్బీఐ ఎంపిసి నిర్ణయం
## 43 పైసలు క్షీణించి 96.78వద్ద ముగింపు

**ముంబయి, అక్టోబరు 7:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి బుధవారం కీలక మద్దతు స్థాయిని కోల్పోయింది. భారతీయ రిజర్వ్‌ బ్యాంక్‌ రెపో రేటును 25 బేసిస్‌ పాయింట్లు పెంచడంతో రూపాయి ఐదు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. రూపాయి విలువ 43 పైసలు క్షీణించి డాలర్‌కు రూ.96.78 వద్ద ముగిసింది. ఇది ఇప్పటివరకు నమోదైన రెండో అత్యంత బలహీన ముగింపు కావడం గమనార్హం. ముందురోజు రూ.96.35 వద్ద ముగిసిన రూపాయి బుధవారం రూ.96.37 వద్ద ప్రారంభమై, రోజులో రూ.96.34-రూ.96.84 మధ్య కదలాడింది. ద్రవ్యోల్బణం, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్‌ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చింది. అంతేకాకుండా తన విధాన వైఖరిని న్యూట్రల్‌ నుంచి క్యాలిబ్రేటెడ్‌ టైటెనింగ్‌కు మార్చింది. దీంతో అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని వడ్డీ రేట్ల పెంపులకు అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడ్డాయి. ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన కమోడిటీ అండ్‌ కరెన్సీ విభాగం వైస్‌ ప్రెసిడెంట్‌ రీసెర్చ్‌ అనలిస్ట్‌ జతీన్‌ త్రివేది మాట్లాడుతూ, ఆర్‌బిఐ రేటు పెంపు, విధాన వైఖరిలో మార్పు కరెన్సీ మార్కెట్‌లో ఆందోళనను పెంచాయని తెలిపారు. ద్రవ్యోల్బణం, రాబోయే ఆర్థిక గణాంకాలను బట్టి మరిన్ని రేట్ల పెంపులకు అవకాశం ఉండటంతో రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చన్నారు. రూపాయి రూ.96.45-రూ.97.25 పరిధిలో కదలాడే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్‌ సీనియర్‌ రీసెర్చ్‌ అనలిస్ట్‌ దిలీప్‌ పర్మార్‌ మాట్లాడుతూ, ఆర్‌బీఐ కఠిన వైఖరి, ద్రవ్యోల్బణంపై పెరుగుతున్న ఆందోళనలు మార్కెట్‌ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని పేర్కొన్నారు. ముడి చమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్లలో రిస్క్‌ అవర్షన్‌ పెరగడం రూపాయిపై మరింత ఒత్తిడి తెచ్చాయని తెలిపారు. సమీప కాలంలో డాలరుతో రూపాయి మారకం రూ.96.97 వద్ద నిరోధం, రూ.96.30 వద్ద మద్దతు ఉండవచ్చని పేర్కొన్నారు. ఆర్‌బిఐ గవర్నర్‌ సంజయ్‌ మల్హోత్రా మాట్లాడుతూ, రియల్‌ ఎఫెక్టివ్‌ ఎక్స్ఛేంజ్‌ రేట్‌ సహా పలు అంచనాల ప్రకారం రూపాయి అధిక విలువలో లేదని, కొంత మేర తక్కువ విలువలో ఉండే అవకాశం ఉందని తెలిపారు. రూపాయి స్థిరపడేలా, సరైన విలువ దిశగా కదిలేలా ఆర్‌బిఐ చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిణామాలు కూడా రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపాయి. డాలర్‌ ఇండెక్స్‌ 0.45 శాతం పెరిగి 102.28కు చేరగా, బ్రెంట్‌ క్రూడ్‌ ధర 1.34 శాతం పెరిగి బ్యారెల్‌కు 101.93 డాలర్లకు చేరింది. రూపాయి బలహీనతతో పాటు భారత ఈక్విటీ మార్కెట్లలోనూ బుధవారం అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

पंजाब नैशनल बैंक ...भरोसे का प्रतीक! punjab national bank ...the name you can BANK upon!

**ప్రజా ప్రకటన**

ఈ ప్రకటన, శూన్య నిల్వ ఉన్న మరియు గత మూడు సంవత్సరాలకు పైగా కస్టమర్‌ ద్వారా ఎటువంటి లావాదేవీలు జరగని నిష్క్రియ ఖాతాదారుల కోసం జారీ చేయబడింది. తమ ఖాతాను తిరిగి సక్రియం చేసుకోవడానికి KYC పత్రాలను సమర్పించి PNB శాఖను సంప్రదించవలసిందిగా కోరడమైనది. ఈ ప్రకటన తేదీ నుండి ఒక నెలలోపు ఖాతాను సక్రియం చేయనట్లయితే, తదుపరి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అటువంటి నిష్క్రియ ఖాతాలను మూసివేయబడతాయి.

ఏవైనా ప్రశ్నలు/సహాయం కోసం దయచేసి మీ శాఖను సంప్రదించండి.

పంజాబ్‌ నేషనల్‌ బ్యాంక్‌
తేదీ: 08.10.2026 అధీకృత సంతకందారు

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.